Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 308 | కరీంనగర్ | శనివారం 28 మార్చి 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## గొల్లపల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కెటిఆర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రాజన్న సిరిసిల్ల, మార్చి 27 : శ్రీరామనవమి సందర్భం గా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని హనుమాన్ ఆలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సంప్రయాదబద్దంగా పండితులు కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాములోరి కల్యాణోత్సవాలకు హాజరైన సందర్భం గా కేటీఆర్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

## కూలిన కళ్యాణోత్సవ వేదిక

### - ఎమ్మెల్యే వేములకు తృటిలో తప్పిన ప్రమాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్లగొండ, మార్చి 27 : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తృటిలో ప్రమాదం తప్పింది. కేతేపల్లి మండలం బండపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదిక అకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని

11లో

## దేశంలో ఎరువుల కొరత లేదు

### - తగినన్ని నిల్వలు ఉన్నాయి
### - లోక్‌సభలో జెపి నడ్డా వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,మార్చి 27 : దేశంలో ఎరువుల కొరత లేదని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సబకు తెలిపారు. దేశంలో అవసరమైన నిల్వలు ఉన్నాయని అన్నారు.పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు. ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం

11లో

## నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు

### - సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, మార్చి 27 : నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.





## కమనీయం... సీతారామ కళ్యాణం



### - మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
### - పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సిఎం దంపతులు
### - రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
### - పలువురు మంత్రులు, ప్రముఖుల రాక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాచలం, మార్చి 27 : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

11లో


## దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం

### - నోయిడా జేవార్‌లో అందుబాటులోకి భారీ ఎయిర్‌పోర్టు
### - నేడు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
### - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ,మార్చి 27 : దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ విమానాశ్రయం దేశ రాజధాని ప్రజలకు విమాన ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ ఎయిర్‌పోర్టును ప్రధాని మోడీ శనివారం ప్రారంభించనున్నారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే ఉంది. ఒక్కోసారి కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకోలేకపోతుంది. దీంతో ఎప్పటినుంచో మరో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ. 11,200 కోట్ల వ్యయంతో నోయిడాలోని జేవార్ ప్రాంతంలో

11లో

## బాలరాముడి నుదుటిపై సూర్య తిలకం
## నవమి వేళ అయోధ్యలో అద్భుతం



### తిలకించి, పులకించిన భక్తజనం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

అయోధ్య, మార్చి 27 : శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆప÷-టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా

11లో

## ఇరాన్‌పై దాడులు తీవ్రం

### - జానావాసలపై దాడిలో 26మంది మృతి




టెహ్రాన్,మార్చి 27 : ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫాహాన్ లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది. గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్

11లో

## ఒంటిమిట్టలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

### - తలంబ్రాల ప్యాకింగ్ పనిలో మహిళలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఒంటిమిట్ట, మార్చి 27 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ శ్రీ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోల్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెశారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు శ్రీమతి

11లో

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

### - దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి
### - పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
### - లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 27 : పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన

11లో

## తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

### - ఏప్రిల్ 25న పార్టీ పేరును, జెండాను, ఎజెండాను ప్రకటిస్తా
### - మేడ్చల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
### - శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
### - తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్, మార్చి 27 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని

11లో





# కమనీయం...రమణీయం...భద్రగిరిపై శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవం

**- సాంప్రదాయబద్ధంగా కళ్యాణ తంతు - పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు.**

**- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు అందజేత.**

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- సీఎంతో పాటు వేడుకలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బట్టి,పొంగులేటి, పలువురు రాష్ట్ర మంత్రులు.**

**- భక్తులతో పోటెత్తిన భద్రగిరి..అన్ని ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాచలం, మార్చి 27 : ఆకాశమంత పందిరి...! భూదేవంత మండపం...! వేదగోష పరిమళాలు...! జయ జయ ద్వానాలు...! ఇది..భద్రగిరినా...!? దక్షిణఅయోధ్యపురినా...!? భక్తుల సంభ్రమాశ్చర్యాలు...! ఖచ్చితంగా 12 గంటలకు...! సాంప్రదాయ అభిజిత్ లగ్నాన...! రాములోరు సీతమ్మవారిని పరిణయం మాడారు...! భద్రాచలంలో శుక్రవారం జరిగిన రాములోరి కళ్యాణం వైభోగమే...! ముగ్ధ మనోహరమే...! కనులారా తిలకించిన భక్తజన హృదయాలు ఉప్పొంగాయి...! భద్రగిరి భక్తులతో పోటెత్తింది...! కమనీయంగా, రమణీయంగా శ్రీ సీతా రాములోరి కళ్యాణం .. భద్రాచలం దివ్య క్షేత్రంలో మిథిలా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సీతారాముల పరిణయ వేడుక ఆబాల గోపాలాన్ని మరిపించింది. ఆధ్యాంతం భక్తులను కనువిందు చేసింది. శుక్రవారం వేకువజామునే రామాలయంలో తొలుత అర్చక స్వాములు స్వామివారికి సుప్రభాత సేవ జరిపారు. అనంతరం నివేదన గావించారు. మూలవర్లకు అభిషేకం జరిపారు. తొలుత ఆలయంలో ఏకాంతంగా ధృవమూర్తుల కళ్యాణం నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులకు అలంకారం గావించారు. స్వామివారిని పల్లకిపై కూర్చుండబెట్టి వేదమంత్రాలు,బాజా భజంత్రీలు, కోలాట దృశ్యాలు నడుమ ఊరేగింపు నిర్వహించి స్వామివారిని మిథిలా ప్రాంగణం వద్దకు తీసుకువచ్చారు. శిల్పకళా శోభిత కళ్యాణ మండపంపై స్వామివారిని కూర్చుండబెట్టి అర్చక స్వాములు కళ్యాణ తంతును నిర్వహించారు. తొలుత తిరు కళ్యాణ సంకల్పం గావించారు. విశ్వక్సేన పూజ జరిపి, పుణ్యాహవాచనం గావించారు. 24 అంగుళాల పొడవు గల 12 దర్భలతో అల్లిన దర్భతాడును సీతమ్మ వారి నడుముకు బిగించారు. రామయ్య కుడి చేతికి సీతమ్మ వారి ఎడమ చేతికి రక్షా సూత్రాలు తొడిగారు. స్వామివారికి సువర్ణ యజ్ఞోపవీతాన్ని ధరింప చేశారు. అనంతరం కన్యాదానం చేశారు. మధ్యాహ్నం 12 గంటలు సమీపించగానే అభిజిత్ లగ్నాన సీతారాముల వారి శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. జనకమహారాజు, దశరథ మహారాజు తరపున చేయించిన రెండు మంగళ సూత్రాలు శ్రీ భక్త రామదాసు వారు చేయించిన మరొక మంగళసూత్రంతో కలిపి మొత్తం మూడు సూత్రాలతో మాంగల్యధారణ గావించారు. తదుపరి తలంబ్రాల తంతు జరిపారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం సందర్భంగా భక్తులు శ్రీరామ జయరామ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా జయ జయ ద్వానాలు చేశారు. దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో భద్రాచలం పోటెత్తింది. రామాలయ పరిసరాలు కిక్కిరిశాయి. కళ్యాణం అనంతరం భక్తులు భద్రాచల రామున్ని బారులు తీరి మరి దర్శించుకున్నారు. భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. స్థానికులు భక్తులకు అన్నదానం, పులిహోర,మజ్జిగ, మంచినీళ్లు,పానకం అందజేసి తమ భక్తి భావాన్ని చాటారు

**పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్లో భద్రాచలం తరలివచ్చిన సీఎం తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని కుటుంబ సభ్యులతో దర్శించు కున్నారు. అనంతరం ఆలయం వద్ద రూ.351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం మిధులా ప్రాంగణంకు చేరుకొని కళ్యాణాన్ని తిలకించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ,సీతక్క,ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ దొర, పలువురు న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం రామాలయం ఈవో దామోదర్ రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కళ్యాణం... కమనీయం... సీతారాముల కళ్యాణం...

**- ఇల్లందకుంటలో కన్నుల పండువగా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం**

**- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు**

**- ముత్యాల తలంబ్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిపి గౌస్ ఆలం**

**- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు - వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మార్చి 27 : అశేష భక్తజనం.. వేదమంత్రాలు, తప్పట్లు, తాళాల మధ్య ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కరీంనగర్ జిల్లా నుంచే కాక వరంగల్, హనుమకొండతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. భద్రాచలం తర్వాత రాములోరి అతిపెద్ద కళ్యాణ మహోత్సవం ఇల్లందకుంటలో జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున కళ్యాణానికి తరలివచ్చారు. రాష్ట్ర బీసీ, రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పూలమాలలు సమర్పించారు. వారంతా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అర్చకులు అంగరంగ వైభవంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కళ్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. ప్రతిఘట్టం భక్తులను ఆకట్టుకుంది. కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం తదితరులు స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. వేలాదిమంది భక్తులు దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. కళ్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వి విఐపి లు, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, చలువ పందిళ్ళు, భారీకేడ్లు, కార్పెట్లు ఏర్పాటు చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. వివిధ మార్గాల ద్వారా కళ్యాణానికి హాజరయ్యే భక్తుల కోసం పలు ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేయించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు, ఏసిపి మాధవి, దేవస్థానం ఈవో సుధాకర్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆచరణీయం

**- మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మందమర్రి మార్చి 27 :శ్రీరాముడు ఆచరించిన జీవితం మన అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మందమర్రి మండలం పాలచెట్టు ప్రాంతంలో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి సతీమణి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు లతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. శ్రీరాముడు నీతి, నిజాయితీ ఆచరించి ఆదర్శనీయంగా నిలిచారని, ఆధ్యాత్మిక మార్గం ద్వారా మనశాంతి కలుగుతుందని తెలిపారు.శ్రీరాముని ఆశయాలను అందరం అనుసరించాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలకు వేసవిలో త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మనిషి జీవన విధానాన్ని శ్రీరాముడు ఆచరించి చూపారని, నీతి, నిజాయితీ కలిగి ఉండాలని తెలిపారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం అందరికీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. శ్రీరాముడి స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు.అనంతరం రాష్ట్ర మంత్రి జిల్లాలోని క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీ, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి

**- రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ**

**- అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రివర్యులు కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూభద్రాచలంలోని శ్రీ సీతారాముల వారి కళ్యాణానికి ప్రాముఖ్యత ఉందని, దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు శ్రీ సీత రామచంద్ర స్వామి కళ్యాణాన్ని వీక్షిస్తారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సంవత్సరం మంత్రిగా తాను ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం, స్థానిక మంత్రి వర్యుల సహకారంతో స్థానికంగా అవసరమైన భూ సేకరణ చేసిన తర్వాత, రాబోయే సంవత్సరం గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత క్రింద భద్రాచలం ఆలయానికి 351 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గోదావరి పుష్కరాల సమయానికి ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తర్వాత రెండవ విడత నిధులు విడుదల చేసుకొని కృష్ణ పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులందరికీ శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజా ప్రభుత్వానికి శ్రీరామ చంద్రమూర్తి శక్తిని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ ప్రెస్ మీట్ లో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల మార్చి 27 : శ్రీ రామ నవమి సందర్భంగా మంచిర్యాల హైటెక్ సిటీలోని శ్రీ హరిహరక్షేత్ర దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం పాలపొరక కార్యక్రమంతో ప్రారంభమైన ఈ వేడుకలో స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీ వారు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు శ్రీనివాస్ రావు దేశ్ పాండే, ఎస్. రవికాంత్ తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, అదనపు కలెక్టర్ గూడూరు శ్రీనివాసరావు దంపతులు, మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య దంపతులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అలాగే 52వ డివిజన్ కార్పొరేటర్ సాయిని స్రవంతి కిషోర్ దంపతులు కూడా హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో హైటెక్ సిటీ, గొల్లవాడ, జన్మభూమి నగర్ ప్రాంతాల భక్తులు, హరిహరక్షేత్ర దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# వేల్పుగొండలో ఘనంగా శ్రీరామ నవమి కళ్యాణోత్సవం

**ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ మార్చ్ 27 : మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో శ్రీ రామా చలం గుట్టపై సీతారాముల కళ్యాణం శ్రీ శ్రీ శ్రీ పూ"పా" రాజయోగి వెంకట స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజున ఉదయం వేద బ్రాహ్మణ పండితులచే గణపతి పూజ, గోపూజ, గురుపూజ, అగ్ని ప్రతిష్ట, శ్రీరామ మూలమంత్ర వాహనము ప్రారంభించడం జరిగింది. భజన సంకీర్తన, అఖండ శ్రీరామ రామ జపం నిర్వహించరు. గ్రామంలోని పుర వీధుల్లో నుండి రామచలం గుట్టపైకి బోనాలు, గండ జ్యోతులు, ఊరేగింపు నిర్వహించడం జరిగింది.అనంతరం సీతారాముల విగ్రహాలను కళ్యాణ వేదికపై స్వాగతించి అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణ పండితులచే సీతారాముల కళ్యాణం నిర్వహించడం జరిగింది.ఇట్టి కళ్యాణానికి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కళ్యాణోత్సవం లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కళ్యాణోత్సవంలో పలు సాంస్కృతిక నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. సాయంత్రం సీతారాముల పల్లకి సేవను భజన సంకీర్తనలతో గ్రామంలో పురవీధుల గుండ ఊరేగింపుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ భాను ప్రకాష్ ఆలయ కమిటీ భక్త బృందం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

**- గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 27 :తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182 శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. అదేవిధంగా, రవాణా, వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ సరఫరా కూడా ఆశాజనకంగా ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు కాగా, ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లను సరఫరా చేసింది. ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ. మొత్తంగా చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే, ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.

# సీతారాముల దీవెనలతో ఆలయాల రూపు రేఖలు మారుస్తా

## - రామగుండం ను ఆధ్యాత్మిక కేంద్రంగా చేస్తా
## - రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మార్చి 27 : సీతారాములోరి ఆశీర్వాదం దీవెనలతో రామగుండం దేవాలయాల అభివృద్ధితోపాటు భక్తులకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఆలయాల రూపు రేఖలు మారుస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా రామగుండం పట్టణ భక్తాంజనేయ ఆలయంలో కన్నులపండువగా నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరై మాట్లాడారు. భక్తాంజనేయ ఆలయ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన కేటాయిస్తానని, ఆలయ ఆవరణలో భక్తజనులకు ఉపయోగపడే సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ ప్రాంతంలోని సమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరల కోసం సదుపాయాలను కల్పించామని, ఇంకా పూర్తిస్థాయి అభివృద్ధి కోసం సిద్ధంగా ఉన్నామని అన్నారు. రామగుండం అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులను చేపట్టి కొనసాగిస్తున్నామని, జరుగుతున్న మార్పును గమనించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజు ఠాకూర్ గుర్తు చేశారు. అనంతరం పాలకుర్తి అంతర్గాం మండలాల్లోని గ్రామాల ఆలయాలలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాలకు హాజరై భక్తజనులతో మమేకమై శ్రీరామనవమి వేడుకల సంబరాలను పంచుకున్నారు. రామగుండం భక్తాంజనేయ ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవానికి వచ్చిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ 30 డివిజన్ కార్పొరేటర్ ఇసంపల్లి అంజులుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పూజారి చందు స్వామి నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఈ వేడుకలలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి, మాజీ కార్పొరేటర్ కౌశిక్ లత, ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు. అనంతరం భక్తజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా రాముని గుండాల కొండపై నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి టిఅయోధ్య సింగ్ ఠాకూర్ హాజరుకాగా ఆలయ కమిటీ పట్టు శాలువాలతో సత్కరించారు ఈ వేడుకల్లో 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి కాంగ్రెస్ సీనియర్ నేత ములుగు వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.





# 8వ కాలనీలో కన్నుల పండువగా రాములోరి కళ్యాణం

## - హాజరైన జి. ఎం.దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మార్చి 27 : ఆర్ జి టు ఏరియా 8 ఇంక్లైన్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం అశేష జన వాహిని సమక్షంలో కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం ఉదయం ప్రారంభమైన కళ్యాణ క్రతువుకు ఆర్ జి టు జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య, వనజా దంపతులుపట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు జగన్నాధాచార్యులు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించి సీతారాముల కళ్యాణ మహోత్సావాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ బండివెంకటయ్య మాట్లాడుతు శ్రీరాముడి జీవితం ఒక సంపూర్ణ జీవన విధానమని, పితృవాక్యపరిపాలన, ఏకపత్నీవ్రతం, ప్రజారంజక పాలన వంటి ఆదర్శాలతో రామరాజ్యం ఎలా ఉండాలో అలా చేసి చూపించారన్నారు. నేడు సమాజంలో నైతిక విలువలు కాపడుకోడానికి శ్రీరాముడి అడుగుజాడల్లో నడవడం ఎంతో అవసరమని, ఈ మహోత్సవానికి విచ్చేసిన భక్త జన సందోహానికి స్వామి వారి కరుణ కటాక్షాలు కలగాలన్నారు. అనంతరం సుమారు ఐదు వేల మంది భక్తులకుయాజమాన్యం చే ఏర్పాటు చేసిన స్వామి వారి పానకం, వడపప్పు, పులిహోర, అన్నప్రసాదం అందజేశారు. ఇట్టి వేడుకలో ఎస్ ఓటు జియం రాముడు, ఆధికార ప్రతినిధి అరవింద్ రావు, ఐఈడి ఎజియం చంద్రశేఖర్, సివిల్ ఎస్ ఈ బాలరాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజాజీ, ఏజెంట్ నెహ్రూ, రెస్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ సునీత, అకౌంట్స్ ఆఫీసర్స్, తిరుపతి రెడ్డి, హిమవర్ష శిరీష, డాక్టర్ రామలక్ష్మి,ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, కార్పొరేటర్ శంకర్ నాయక్, కిషన్ రెడ్డి మొదలగు వారు పాల్గొనగా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్ ఆధ్వర్యంలో జూనియర్ ఇన్స్పెక్టర్లు బీపీ రాజయ్య కే రాజమౌళి, షిఫ్ట్ జమేదార్ జి శ్రీనివాస్, ఇంటెలిజెంట్ మహబూబ్ అలీ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# తెలంగాణ ఆధికారుల పర్యవేక్షణలో కొనుగోలు కేంద్రం



## - కేసముద్రం మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : కేసముద్రం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నందు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కజొన్న విక్రయా కేంద్రం లో ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తూ విక్రయాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులతో అన్నారు.మొక్కజొన్న చివరి గింజ వరకు ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తుందని రైతులు ఎవ్వరు అధైర్య పడవద్దని మీ పంటను దళారుల చేతికి పంపించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ ఎ ఎం సి మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీత వెంకన్న నాయక్,వైస్ చైర్మన్ అల్లం రమా నాగేశ్వరరావు,మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,సురేందర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దస్రు నాయక్, చిలువేరు సమ్మె గౌడ్,తరాల వీరేష్ గారు కౌన్సిలర్,బండారి వెంకన్న,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా మణులు,సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.









# హిందూ... ముస్లిం... భాయ్ భాయ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 27 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయం వద్ద హిందూ ముస్లిం భాయ్ భాయ్ అన్నట్లుగా అక్కడ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కోదండ రామాలయం వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా, సౌభ్రాతృత్వానికి ఆదర్శంగా నిలిచారు. జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ముస్లిములు ఆలయం వద్ద ప్రత్యేకంగా షామియానా ఏర్పాటు చేసి భక్తులకు చల్లని తాగునీరు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ రంజాన్, బక్రీద్ పండుగలప్పుడు పలువురు హిందువులు తమకు కలిసి శుభాకాంక్షలు తెలుపుతారని, కులమతాలకు ఎలాంటి భేదం లేదని శ్రీరామనవమి సందర్భంగా తాము భక్తులకు చల్లని మంచినీరు పంపిణీ చేశామని తెలిపారు. ఎవరైనా సరే ఎదుటివారికి సహాయం చేసినప్పుడే ఆనందం కలుగుతుందని వారు అన్నారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణం

## - పెద్ద ఎత్తున తరలివచ్చిన అశేష భక్త జనం - సీతారాములకు హారతి ఇచ్చిన కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 27: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అశేష భక్తజన సమూహంలో శుక్రవారం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో నీ కోదండ రామాలయం వద్ద రాములోరి కళ్యాణం తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బ్రాహ్మణవాడలోని శివకేశవనాథ ఆలయం నుండి సీతా, రాముడు, హనుమాన్ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా పట్టణంలోని పలు వీధుల గుండా జనకాపూర్ రామాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే కోవాలక్ష్మి కుమారుడు సాయి కుమార్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, గాజులు, బియ్యం తదితర పూజా సామాగ్రిని అందజేశారు. ప్రముఖ అర్చకులు నిమ్మకంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో రాజశేఖర్ శర్మ ,వోజ్జల శిరీష్ శర్మ, విజయ్ కుమార్ శర్మ, తిరుపతి చారి, శ్రీధర్,,అభయ్ ఆచారి ల ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణ క్రతువును నిర్వహించారు. అంతకుముందు కోదండ రామాలయంలో పలువురు మహిళలు స్వామివారి కళ్యాణం కోసం పచ్చని పందిరి ఏర్పాటు చేసి,తలంబ్రాలను కలిపారు. అర్చకుడు సంతోష్ శర్మ రాములోరి కళ్యాణాన్ని నిర్వహించారు.

కళ్యాణాన్ని తిలకించేందుకు జిల్లాలోని వాంకిడి , కేరా మేరీ , రెబ్బెన ,తిర్యాని, బెజ్జూర్, కౌటాల తదితర మండలాల నుండి పెద్ద ఎత్తున భక్తులు, హనుమాన్ మాలధారణ స్వాములు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

**కల్యాణానికి హాజరైన కలెక్టర్**

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల కోదండ రామాలయంలో శుక్రవారం నిర్వహించిన సీతారాముల కల్యాణానికి కలెక్టర్ కె హరిత హాజరయ్యారు. కోదండ రామాలయంలో దర్శనం చేసుకున్నారు. సీతారాముల వారికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**భక్తులకు చల్లని నీరు మజ్జిగ పంపిణీ**

సీతారాముల కళ్యాణం సందర్భంగా నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులకు వివిధ సంఘాలు చల్లని నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



# రైతుల భరోసా నిధుల విడుదలతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల హర్షం


## సీఎం మంత్రుల ఫ్లెక్సీలకు ఆత్రం సుగుణ పాలాభిషేకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేయడంతో రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు.శుక్రవారం డీసీసీ కార్యాలయం ఆవరణలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల్లమంగ, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీకి సుగుణ పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూరైతు భరోసా నిధుల విడుదలతో రాష్ట్రంలోని రైతుల్లో ఆనంద వాతావరణం నెలకొన్నదన్నారు. ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతు భరోసా పథకం ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లో నిధులు జమ కావడం ప్రభుత్వ రైతు అనుకూల విధానాలకు నిదర్శనమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు తారిఖ్,భీమ్ రావ్,కౌన్సిలర్ వినోద్, ఆర్ జి పిఆర్ఎస్ ఇంచార్జి కోవా ఇందిరా,సిడాం తిరుపతి, మాజీ ఎంపీటీసీ,నాయకులు పెందొర్ సుధాకర్, ఇమ్రాన్, నిజం,ఆత్రం భీం రావ్,హరీష్, రాము, ఏఎంసీ డైరెక్టర్ లు మారుతి పటేల్, జకన్నా,మోహన్, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కోదండ రామాలయంలో ఘనంగా శ్రీ రామ నవమి వేడుకలు

## - కన్నుల పండువగా శ్రీ సీతారామచంద్రుల కల్యాణం - వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు... - ఉదయం నుంచే కిటకిటాలాడిన ఆలయాలు.. - పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు - పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మాజీ పద్మాదేవేందర్రెడ్డి దంపతులు - స్వామివారి దర్శించుకున్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు - మార్మోగిన రామా నామస్మరణ... - మెదక్ జిల్లా వ్యాప్తంగా వేడుకలు







(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మార్చి 27 : తీరొక్క పందిళ్లు.. మేళతాళాల చప్పుళ్లు... ఎదుర్కోళ్లు, పూజారుల వేద మంత్రాలు... భక్తుల జయజయధ్యానాల నడుమ శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి అన్ని ఆలయాల వద్ద భక్తులు బారులు తీరగా సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాల కోసం పోటీ పడ్డారు. మెదక్లోని శ్రీ కోదండ రామాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని దేవతామూరు లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్రెడ్డి పాల్గొని స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్త మానవాళికి ఆదర్శపురుషుడైన జగదభిరాముడి కల్యాణ వేడుకలు కడు రమణీయంగా సాగాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగా వైభవంగా జరిగింది. ముందుగా పల్లకీ సేవలో అమ్మవారిని, స్వామివారిని ఊరేగిస్తూ... మావంశం గొప్పదంటే... మా వంశం గోప్పదని చెప్తూ.. కొందరు రామయ్య వైపు వ రికొందరు సీతమ్మవారి వైపు చేరి ఎదుర్కోళ్ళ వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై ప్రతిష్టింపజేశారు. ఆర్చక స్వాములు రక్షాబంధనాలను సీతా అమ్మవారి, రాముల వారి ముంజేతికి అలంకరింపజేశారు. సుముహుర్తం ప్రారంభం కాగానే ఆలయ ఆర్చకులు నారాయణ చార్యులు, నర్సింహా చార్యులు, వెంకట చార్యులు,వేద పండితులు వైద్య శ్రీనివాస్ శర్మ, కృష్ణారావు, శ్రీవాండ్ల కృష్ణమూర్తి , దమన్నగారి ప్రసాద్, రాయి కోటి పండిత్ రావు, శ్రీవాండ్ల సాయిబాబా, లక్ష్మణరావు, శ్రీనివాస్ చారి మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నయనానందకరంగా సాగింది. ఈ మహాకత్రవును వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. భజన మండలి ఆలపించిన భక్తి గీతాలతో ప్రాంగణమంతా రామనామ స్మరణతో భక్తి పారవశ్యంతో మార్మోగింది. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ రావు దేవతామూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, పూజలో పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్రెడ్డి దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. స్వామి వారిని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నేత కంఠారెడ్డి తిరుపతిరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు పదివేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్ తదితరులు ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ వేడుకల్లో మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు గంగా మణి, హరిత, లక్ష్మీ, రాజమణి , ఆంజనేయులు, శివరామ కృష్ణ, రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు యాచం బాల్ రాజ్ నగరం మల్లేశం నందిని శ్రీనివాస్, పురుషోత్తం, సకిలం శ్రీనివాస్, బద్రినాథ్, గోపాలకృష్ణ, మాజీ కౌన్సిలర్లు వివిధ పార్టీ నేతలు, పెద్దఎత్తున భక్తులు, ప్రముఖులు తధితరులు పాల్గొన్నారు.

# ఖని కిరాణ మర్చంట్ అండ్ రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో పులిహోర కు రైస్, సరుకుల పంపిణీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మార్చి 27 : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలోని రాంమందిర్లో ఉన్నటువంటి శ్రీ రామాల యంలో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గత 12 సంవత్సరాలుగా గోదావరిఖని కిరాణ మర్చంట్ అసోసియేషన్ అండ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులందరికీ ఉచితంగా పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.అందులో భాగంగా సంవత్సరం కూడా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ నేతృత్వంలో మేయర్ మహంకాళి స్వామి కోదండ రామాలయం చైర్మన్ గట్ల రమేష్ సహకారంతో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా హాజరైన వేలాది మంది భక్తులకు ఉచిత పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవు తోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉ ంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరా÷– పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగి స్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉ న్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుం దన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగి స్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హార్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ఠ స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉ ండనుంది.

### భారత ప్రజాస్వామ్యంలో సరికొత్త అధ్యాయం

# మారనున్న దేశ రాజకీయ ముఖచిత్రం


### తెలంగాణలో 179, ఏపీలో 263, తెలుగు గడ్డపై పునర్విభజన రాజకీయ ప్రకంపనలు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494






భారత రాజకీయ యవనికపై త్వరలో సంభవించబోయే అత్యంత కీలకమైన, చారిత్రాత్మకమైన పరిణామం నియోజకవర్గాల పునర్విభజన. ఇది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును, అధికార సమతుల్యతను, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని సమూలంగా ప్రభావి తం చేసే ఒక బృహత్తర ప్రక్రియ. జనసంఖ్యలో వస్తున్న మార్పులు, ప్రాంతీయంగా నెలకొన్న అసమానతలు, మారుతున్న సామాజిక ముఖచిత్రం నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సిన ఈ ప్రక్రియ ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను చర్చకు దారితీసింది. ముఖ్యంగా 2029 సాధారణ ఎన్నికల నాటికి నూతన నియోజకవర్గాల ఏర్పాటును పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పం, లోకసభ స్థానాల సంఖ్యను 543 నుండి ఏకంగా 816కి పెంచే ప్రతిపాదనలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుండటం ఆయా రాష్ట్రాల రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసే అవకాశముంది.

భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిగే అధికారిక జనగణన (సెన్సస్) ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, గతంలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాల వల్ల జనాభా తగ్గుముఖం పట్టిన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో, 1971 జనగణన ప్రాతి పదికన ఏర్పడిన స్థానాలనే 2001 వరకు, ఆ తర్వాత 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకు స్తంభింపజేశారు. ప్రస్తుతం 2026 గడువు సమీపిస్తుండటంతో, తదుపరి జరిగే జనగణన ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. సాంకేతికంగా 2031 జనగణన దీనికి ప్రామాణికం కావాల్సి ఉన్నప్పటికీ, పరిపాలనా సౌలభ్యం మరియు రాజకీయ వ్యూహాల నేపథ్యంలో 2029 నాటికే ఈ మార్పులను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోకసభ స్థానాల సంఖ్యను సుమారు 50 శాతం పెంచి 816కి చేర్చడం ద్వారా ప్రతి ఎంపీ ప్రాతినిధ్యం వహించే జనాభా పరిమాణాన్ని తగ్గించి, ప్రజలకు – ప్రతినిధులకు మధ్య దూరాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం.

ఈ భారీ మార్పు కేవలం అంకెల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, ఇది దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు అధికంగా ఉ ండటం వల్ల, పునర్విభజన అనంతరం ఆ రాష్ట్రాలకు దక్కే లోకసభ సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా, దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి జనాభాను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది ఉత్తర–దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ వైరుధ్యాలకు, నిధుల కేటాయింపులో అసమానతలకు దారితీస్తుందన్నది రాజ్యాంగ నిపుణుల హెచ్చరిక. ఓటు హక్కు వినియోగించుకునే పౌరుల సంఖ్య ప్రాతిపదికన సీట్లు పెంచడం ప్రజాస్వామ్య సూత్రమే అయినప్పటికీ, బాధ్యతాయుతమైన రాష్ట్రాలు రాజకీయంగా శిక్షకు గురికాకుండా చూడటం కేంద్రం ముందున్న అతిపెద్ద సవాలు.

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, పునర్విభజన ప్రక్రియ అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుంది. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాలను 179కి పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే జనాభా నిష్పత్తి ప్రకారం సీట్ల పెంపు అవసరమని రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రస్తుతం ఉన్న నియోజక వర్గాలు భౌగోళికంగా పెద్దవిగా ఉండటం, కొన్ని ప్రాంతాల్లో జనాభా సాంద్రత విపరీతంగా పెరగడం వల్ల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కొత్తగా 60 స్థానాలు పెరగడం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు మెరుగైన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఇది కొత్త నాయకత్వం ఉ ద్భవించడానికి మార్గం సుగమం చేస్తుంది. అయితే, ఇదే సమయంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన పాత రాజకీయ సమీకరణాలు చెల్లాచెదురవుతాయి. సామాజిక వర్గాల వారీగా ఓటు బ్యాంకులు చీలిపోయే అవకాశం ఉండటంతో, రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను మొదటి నుండి సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 శాసనసభ స్థానాలు 263కి పెరిగే అవకాశం ఉండటం ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అనేక ఆర్థిక, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా అభివృద్ధి ఫలాలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. చిన్న నియోజకవర్గాలు ఏర్పడటం వల్ల శాసనసభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలపై మరింత దృష్టి సారించే వీలుంటుంది. రాజకీయంగా చూస్తే, సీట్ల సంఖ్య పెరగడం వల్ల టికెట్ల కోసం పార్టీల్లో ఉండే అంతర్గత విభేదాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, కొత్తగా ఏర్పడే స్థానాల్లో ఏ సామాజిక వర్గం ఆధిపత్యం చెలాయిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వ్ చేయబడే స్థానాల సంఖ్య కూడా పెరగడం వల్ల సామాజిక న్యాయం మరింత సమర్థవంతంగా అమలయ్యే అవకాశం ఉంది.

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 'డిలిమిటేషన్ కమిషన్' అనే అత్యున్నత స్వతంత్ర సంస్థ నిర్వహిస్తుంది. సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో పనిచేసే ఈ కమిషన్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు, రాష్ట్రాల ఎన్నికల అధికారులు సభ్యులుగా ఉంటారు. జనాభా ప్రాతిపదికన సరిహద్దులను నిర్ణయించేటప్పుడు భౌగోళిక విస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం, కమ్యూనికేషన్ సౌకర్యాలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదికకు చట్టబద్ధమైన రక్షణ ఉంటుంది. దీనిని ఏ కోర్టులోనూ సవాలు చేయడానికి వీలుండదు. ఈ నిబంధన రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడానికి ఉద్దేశించినదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికార పార్టీలు తమకు అనుకూలమైన ప్రాంతాలను కలుపుకోవడం లేదా వ్యతిరేక ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాలను విడదీయడం వంటి 'గెర్రీమాండరింగ్' (Gerrymandering) చర్యలకు పాల్పడతా యనే విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతా ల్లో నియోజకవర్గాల విభజన తీరు ఓటర్ల ప్రభావాన్ని మార్చి వేస్తుంది.

కేంద్ర ప్రభుత్వం ఈ మార్పుల కోసం ముందుచూపుతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనం (సెంట్రల్ విస్టా)లో సభ్యుల సీటింగ్ సామర్థ్యాన్ని పెంచడం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. లోకసభలో 888 మంది, రాజ్యసభలో 384 మంది కూర్చునేలా అత్యాధునిక వసతులతో భవనాన్ని సిద్ధం చేయడం ద్వారా, భవిష్యత్తులో పెరగబోయే సభ్యుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఇప్పటికే కల్పించారు. ఇది కేవలం భవన నిర్మాణం మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య పరిమాణం విస్తరిస్తుందనే సంకేతం. అయితే, ఈ విస్తరణలో ఆత్మవంచన చేసుకోకుండా, అన్ని రాష్ట్రాల హక్కులను కాపాడటం ముఖ్యం. దక్షిణ రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యసభ స్థానాల కేటాయింపులో లేదా ఆర్థిక సంఘం నిధుల పంపిణీలో ప్రత్యేక వెసులుబాటు కల్పించడం ద్వారా సమాఖ్య స్ఫూర్తిని చాటుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

ఈ పునర్విభజన ప్రక్రియ వల్ల మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా మార్గం సుగమం కానుంది. లోకసభ, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలు కావాలంటే పునర్విభజన తప్పనిసరి. సీట్ల సంఖ్య పెరగడం వల్ల పురుష అభ్యర్థుల అవకాశాలకు పెద్దగా భంగం కలగకుండానే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే వీలుంటుంది. ఇది భారత రాజకీయాల్లో లింగ సమానత్వాన్ని సాధించడానికి ఒక గొప్ప అవకాశం. అదేవిధంగా, కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత పెరుగుతుంది. పెద్ద నియోజకవర్గాల్లో సామాన్య కార్యకర్తలు నాయకులుగా ఎదగడం కష్టం, కానీ చిన్న నియోజకవర్గాల్లో ప్రజాబలం ఉన్న వ్యక్తులు అసెంబ్లీకి లేదా పార్లమెంటుకు ఎన్నికయ్యే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

ముగింపుగా చూస్తే, 2029 నాటికి అమలులోకి రానున్న నియోజకవర్గాల పునర్విభజన అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మహా క్రతువు. ఇది కేవలం ఓటర్ల సంఖ్యను సరిచేయడం మాత్రమే కాదు, దేశ రాజకీయ దిశను మార్చే కీలక మలుపు. జనాభా ప్రాతిపదికన ప్రతినిధుల సంఖ్యను పెంచడం ద్వారా పౌరుల గొంతుకకు మరింత బలం చేకూరుతుంది. అయితే, ఈ ప్రక్రియలో ప్రాంతీయ అసమానతలు తలెత్తకుండా, అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా చూడటం అత్యవసరం. తెలంగా ణలో 179, ఆంధ్రప్రదేశ్‌లో 263 స్థానాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయాలు నూతన ఉత్సాహాన్ని సంతరించుకోనున్నాయి. రాజ కీయ పార్టీలు తమ పాత మూస పద్ధతులను వీడి, మారుతున్న సరిహద్దులకు, మారుతున్న సమీకరణాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలి. పారదర్శకతతో, శాస్త్రీయ దృక్పథంతో ఈ పునర్విభజన పూర్తయితే, అది భారత ప్రజాస్వామ్యాన్ని ప్రపం చంలోనే అత్యంత పటిష్టమైన వ్యవస్థగా తీర్చిదిద్దుతుందనడంలో సందేహం లేదు.

**–వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**


# ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు



భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టుకొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచార కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదా యినిగా విరాజిల్లుతున్నది... జగిత్యాల జిల్లాలోని గోదావరీ తీరస్థ సుప్రసిద్ధ తీర్థమైన ప్రాచీన ధర్మపురి పుణ్యక్షేత్రం. తెలుగు నేలపై సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరిహర క్షేత్రంగా, పౌరాణిక ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడినది. ఈక్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమ ధర్మరాజు మందిరం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా ధర్మపురి క్షేత్రంలో వెలసిన "యమ ధర్మరాజును దర్శిస్తే యమపురి ఉండబోదని" ప్రతీతి. హిరణ్యకశిపుని సంహారానంతరం, ఉగ్ర నారసింహుని శాంతింప జేసేందుకై బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థమూ, పవిత్ర క్షేత్రమూ అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానాది సత్కర్మల నొనరించినట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమ ధర్మరాజు, తన లోకమునందు అనేక నరక బాధలను అనుభవించు చున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తను ఇట్లు విచారించెనని, పుణ్యాత్ములను దర్శించినచో పుణ్యము, పాపాత్ములను చూసినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుటచే తనకు పాప సంచయమే కలుగు చున్నదని, తన యందు స్వయంకృత పాప మనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనముతో మనశ్శాంతి కలుగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్య క్షేత్ర దర్శన ప్రయాణ ఉన్ముఖుడై, సమస్త క్షేత్రముల తిరిగి చివరకు ధర్మపురికి ఏతెంచెనని, ఈ క్షేత్రమున గోదావరి నదీ స్నానమాచరించగనే యమునకు మనశ్శాంతి కలుగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెనని, బ్రహ్మాండ, స్కాంద పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు, నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమ ధర్మ రాజు నృసింహుని మందిరాని కేగి చేసిన పూజలకు ప్రసన్నుడైన నారసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించుమని తెలిపెనని, యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమకుండ"మని పేరు కలుగునట్లు, అచట స్నానమాచరించి నృసింహుని పూజించు వారికి యమలోక బాధలు కలుగ కుండునట్లు, సర్వపాప విముక్తి కలుగునట్లు నరసింహుడు వరమిచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును శ్రీనరసింహ మందిర పురోభాగమున నిలిపినట్లు పురా ణాలు విశదీకరిస్తున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన ఉంది యమ ధర్మరాజు మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. 'దక్షిణాభి ముఖీగంగా, యత్ర దేవో నృకే సరీ, తత్రశ్రీర్విజయోర్భూతి:, కాశ్య యశ్శత గుణం భవేత్" అని దక్షిణాభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి యున్నది. వేరెచ్చటనూ కానరాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తున్నది. అష్ట దిక్పాలకులలో ఒకరైన యముడు దక్షిణ దిశాధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా కుజుడు దక్షిణ దిశాధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడని పరాశరుడు "బృ హత్ పరాశర హోరా శాస్త్రం" నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహిని.యైన గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరించి, నరసింహుని దర్శిస్తే నరక బాధలుండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యతను సంతరించికున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజునును దర్శించే భక్తుల సంఖ్య నానాటికీ అధిక మవుతున్నది. ఇటీవల సంభ విస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్త" ప్రత్యేక పూజాదులలో అంతర్భాగంగా అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్త పఠనాలు, జ్వరహర స్తోత్రం, రోగ నివారణ సూక్తాలు,యమాష్టకాది పూజలలో పాల్గొనేందుకై సుదూర ప్రాంతాల నుండి భక్తులు క్షేత్రానికి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య నానాటికీ అధికమవుతున్నది. మార్చి 28వ తేదీ...ధర్మరాజ దశమి లేదా యమ ధర్మరాజ దశమి మృత్యు సంబంధ హిందూ దేవుడు అయిన యమ భగవా నుడికి అంకితం చేయ బడింది. యమ ధర్మరాజు అని కూడా పిలువబడే యమ ధర్మరాజు కు అంకితం చేసిన పూజ ఆ రోజు జరుగుతుంది. ఈ వ్రతాన్ని 10 వ రోజు చైత్ర మాసం శుక్ల పక్షంలో పాటిస్తారు. ప్రాథమికంగా రోజున చేసే పూజలు భక్తుడి నుండి మరణ భయాన్ని తొలగించడానికి సహాయ పడుతాయి.

**ధర్మరాజ దశమి సందర్భంగా...**

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

## వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు - పట్టు వస్త్రాల సమర్పణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మార్చి 27 : భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో గల రామాలయం, సింగరేణి 1000 క్వార్టర్స్ లో జరిగిన కళ్యాణ వేడుకల్లో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపురం మండలంలోని ధర్మారావుపేట, బుద్దారం, బసవరాజుపల్లి, చెల్పూర్, మైలారం గ్రామాలు, అలాగే కొత్తపల్లి గోరి మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్ర వేడుక అని పేర్కొన్నారు. ఈ మహోత్సవం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా శ్రీరాముని ఆశీస్సులు ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువస్తాయని, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, సింగరేణి జీఎం, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# సీతారాముల కళ్యాణం లోక కళ్యాణానికి ప్రతీక

- భక్తిభావంతో జరుపుకునే పండుగలు మానసిక ప్రశాంతతను ఇస్తాయి
- నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి
- ఉత్సవ కమిటీల కృషి అభినందనీయం-రామయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి.
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : సీతారాముల కల్యాణం లోక కల్యాణానికి ప్రతీక అని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పలు మండపాలు, దేవాలయాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌లతో కలిసి ఆయన సందర్శించి సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఇంత ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. శ్రీరామ నవమి వేడుకలు సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. భక్తిభావంతో జరుపుకునే ఇటువంటి పండుగలు ఒత్తిడితో కూడిన నేటి జీవనశైలిలో మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆ శ్రీరామచంద్రుని కృపతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల విజయవంతానికి ప్రతి మండపాలు, దేవాలయాల వద్ద వద్ద ఉత్సవ కమిటీలు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అనంతరం ప్రసాద పంపిణీని ప్రారంభించారు. మండపాలు, ఆలయాల సందర్శన అనంతరం ఆయన నేరుగా భద్రాచలంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.






# కమనీయం.. రమణీయం.. రాములోరి కళ్యాణం

## - తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు - ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక నగరంగా మారుస్తా - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మార్చి 27: శ్రీ రామనవమి సందర్భంగా గోదావరిఖని కోదండ రామాలయంలో శుక్రవారం సీతా రాములకళ్యాణ మహోత్సవం కన్నులపండుగగా జరిపించారు. వేద పండితులు మధుసూదనాచార్యుల బృందంచే భక్తుల కోలాహలం నడుమ స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతా రామచంద్ర స్వామికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ స్వయంగా తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలను తీసుకొని వచ్చి, ఆస్వామి వారికి సమర్పించారు. వేదపండితులు సీతా రాములకు జీలకర్ర బెల్లంతోపాటు కళ్యాణ కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాల నడుమ జరిపించారు. రామగుండం ఎమ్మెల్యే దంపతులు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి దంపతులు, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య దంపతులు, జీఎం లలిత్ కుమార్ దంపతులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మండపంలో కూర్చొని భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించారు. భక్తులు ఆసక్తిగా తిలకిస్తుండగా వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ సీతమ్మ మెడలో రామయ్యతో తాళి కట్టించారు. అనంతరం భక్తులు సీతారాములకు తలంబ్రాలను సమర్పించడానికి ఎగబడ్డారు. ఏసిపి మడత రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి,ట్రాఫిక్ సీఐరాజేశ్వర్ రావు, సిబ్బంది కళ్యాణ వేదిక వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులు స్వామి వారికి తలంబ్రాలను సమర్పించే సమయంలో తోపులాట జరుగకుండా చూసారు. రామగుండం ఎమ్మెల్యే ఆదేశాలతో సింగరేణి, రామగుండం మున్సిపల్, రామాలయం కమిటీ శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా జరిపించేలా, భక్తులకు కళ్యాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లను, కూలర్ సౌకర్యం, తాగునీరు, షామియాలను ఏర్పాటు చేశారు. కళ్యాణానికి వచ్చే భక్తులకు సాదరస్వాగతం పలుకుతూ ఆకర్షణీయంగా భారీ ఆర్చ్ ను ఏర్పాటు చేశారు. స్వామి వారి కళ్యాణానికి భారీ మండపాన్ని వేసి వేలాది మంది భక్తుల నడుమ కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మాట్లాడుతూ కోదండ రామాలయం ఆవరణలో 2 కోట్ల నిధులతో కళ్యాణ మండపం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా దానిని తీర్చిదిద్దుతామన్నారు. కోట్లాది రూపాయల నిధులతో నగరాన్ని సుందరీకరణ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక నగరంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇదే క్రమంలో బి పవర్ హౌజ్ హనుమాన్ జంక్షన్ వద్ద భారీ హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేస్తామని, సమ్మక్క జాతర ఆవరణలో సకల సదుపాయాలు కల్పించామన్నారు. రామగుండం కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు.




# రామ-చంద్ర పట్టాభిషేకం కై ఎదురుచూస్తున్న ప్రజలు

## - తెలంగాణలో రావణ పాలన అంతం కోసం - వానర సైన్యం వలె కార్యకర్తలు ఉద్యమించాలి - ఖనిలో మజ్జిగ, చలివేంద్ర కేంద్రాలు ప్రారంభం - బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మార్చి 27 : తెలంగాణ రాష్టంలో రవాణా పాలన అంతం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్లా హరీష్ రెడ్డి అన్నారు. రామ - చంద్ర పట్టాభిషేకం కోసం తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వానర సైన్యం వలె కార్యకర్తలు పనిచేయాలన్నారు. వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ని పురస్కరించుకొని శ్రీ సీతారామ కళ్యాణం మహోత్సవానికి విచ్చేస్తున్న ప్రజలు భక్తులు మహిళలకు దాహార్తి తీర్చాలనే సంకల్పంతో రామగుండం నియోజకవర్గం లోని ప్రధాన ఆలయాల వద్ద జరిగే కళ్యాణోత్సవ వేడుకలలో ఉచిత మజ్జిగ, చలి వేంద్ర కేంద్రాలు బిఆర్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ ప్రారంభించారు. శుక్రవారం ఎనిమిదవ కాలనీ, గోదావరిఖని కోదండ రామాలయం, గంగానగర్ చంద్రశేఖర్ నగర్ లో అన్న ప్రసాదం తో పాటు గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఐబి కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కల్యాణోత్సవానికి వచ్చే ప్రజలకి ఉచిత, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవం రామచంద్రుడి పట్టాభిషేకం భక్తులు ఆశీర్వచనం పొందేందుకు పెద్ద సంఖ్యలో వస్తారని వారి సౌకర్యార్థమే వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు ఎగవేసి, రైతులకు రైతుబంధు మోసం, మహిళలకు పించన్లు, నిరుద్యోగులకు టోకరా పెట్టిన రావణ పాలన అంతం కొరకు ఎదురుచూస్తున్నారని, రాబోయే తెలంగాణ ప్రభుత్వం లో రామ-చంద్ర( కేటీఆర్-కెసిఆర్) పట్టాభిషేకం కై భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఉద్యమించాలని ప్రజల అభీష్టం మేరకు రామచంద్ర పట్టాభిషేకం నిర్వహించేలా కంకణబద్ధులై ముందుకు సాగాలని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల కోరికలు సిద్ధించేలా రైతులు మంచి లాభసాటి వ్యవసాయం పొందేలా సీతారామాంజనేయ స్వామి ఆశీస్సులు అందించాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాజమున తహజీబ్ ముస్లిం లు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమాలలో రామగుండం కార్పొరేషన్ మాజీ కో అప్షన్ మెంబర్ తస్నింబాను జాహిద్ పాషా, అక్బర్, అబ్దుల్ కదీర్, తహసీన్, మొయిన్ రాజ్ మొహమ్మద్, పాల్గొన్నారు.



# మహబూబాబాద్‌లో ప్రారంభమైన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

## - ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దు - ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న విక్రయించే ఏ రైతుకు ఎలాంటి ఆటంకాలు,ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఆటంకాలు ఇబ్బందులు కలిగిన ఉపేక్షించబోమని అధికారులకు సూచించారు. ఈ మార్కెట్లో మొక్కజొన్న విక్రయించే ఏ రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు చూసుకోవాలని అన్నారు. రైతులు ఎలాంటి అపోహాలకు పోకూడదని ఎట్టి పరిస్థితుల్లో దళారులకు పంటను ముట్ట చెప్పొద్దని,ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని సరైన గిట్టుబాటు ధర కల్పించిందని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఎంసీ మార్కెట్ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ లోయ,మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్,మహబూబాబాద్ మండల అధ్యక్షులు మిట్టకంటి రామ్ రెడ్డి,కౌన్సిలర్ చితిరాల అరుణ జ్ఞానేశ్వర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి వెంకన్న,పలు వార్డ్ కౌన్సిలర్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆలేరు అభివృద్ధికి దిశా నిర్దేశం

## - మౌలిక వసతుల మెరుగుదలపై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మార్చి 27 : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రత్యేక సమావేశ అంశాలపై చర్చించారు. పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తూ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. పట్టణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి వార్డు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం తమ బాధ్యతనన్నారు. ప్రతి వార్డులో ప్రాథమిక సదుపాయాలు మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని, సేవలను పారదర్శ కంగా, వేగవంతంగా అందించాలని సూచించారు. పన్నులు, ఆదాయ వనరుల పెంపు ద్వారా మున్సిపాలిటీ ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

# కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం

## - కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్,

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 27 : శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామ చంద్ర స్వామివారి కల్యాణం వాడవాడలా ఘనంగా జరిపారు. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్పల్లి, భరత్ నగర్, బాలానగర్, బేగంపేట, బోయినపల్లి, అల్లాపూర్, వివేకానంద నగర్, మోతి నగర్, తదితరప్రాంతాల్లో జరిగిన స్వామివారి కళ్యాణం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు స్వామివారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత కూడా రాజ్య పాలనకు శ్రీరామరాజ్యాన్ని కొలమానంగా తీసుకోవడం ఆయన పరిపాలనా గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. పాలనలో నేటికీ ఆయన ఆదర్శ పురుషుడిగా విలసిల్లుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# పాపన్నపేటలో బొమ్మ బొరుసు ఆడుతున్న 7 మంది కేసు నమోదు

## రూ.18500 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మార్చి 27 : మండల కేంద్రమైన పాపన్నపేటలో బొమ్మా బొరుసు ఆడుతున్న 7 మందిని పోలీసులు పట్టుకున్నట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం పాపన్నపేటలోని రామారపు వారి తోటలో కొందరు బొమ్మ బొరుసు ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా, కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18 వేల ఐదువందల నగదు,5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, జూదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సమాజంలో చెడు ప్రభావం పడుతుందని తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పాపన్న పేట పోలీస్ లకుతెలియజేయాలని ప్రజలను కోరారు.




# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

**- భక్తుల తాకిడితో కిక్కిరిసిన భద్రాద్రి క్షేత్రం**
**- రూ. 351 కోట్లతో ఆలయ విస్తరణ తొలిదశ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం**
**- శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27: భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భద్రాచలం మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వేలాది భక్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మిథిలా స్టేడియంలో శ్రీ రామచంద్రస్వామి, సీతమ్మ వారికి పూజా కార్యక్రమం, అలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించి పెళ్లి కొనసాగించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలను నిర్వహించారు. భద్రాచలం ఆలయం సర్వాంగ సుందరంగా అలంకరించబడగా, భక్తుల రాక పోకలతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దర్శనం కోసం భారీగా తరలివచ్చి దర్శనం పొందారు. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. త్రాగునీరు, అన్న ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం ఆలయం వద్ద 351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, లక్షలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు కారుణ్య నియామకాలు ఎత్తివేతకు కుట్ర

**- టిబీజీకేఎస్ ఆరోపణలు - నిరసన కార్యక్రమాలకు పిలుపు - కార్మికులు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : సింగరేణిలో మెడికల్ బోర్డు ఆధారిత కారుణ్య నియామకాలను ఎత్తివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) నాయకులు ఆరోపించారు. కొత్తగూడెంలో టిబీజీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి టిబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో గోల్డెన్ హ్యాండ్‌షేక్ పేరిట వేలాది మంది కార్మికులను తొలగించిన విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని విమర్శించారు. మెడికల్ బోర్డు వ్యవస్థను నిలిపివేసి అనారోగ్యంతో ఉన్న కార్మికులకు న్యాయం జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నియామకాలపై అవకతవకల ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా విజిలెన్స్, ఏసీబీ విచారణల పేరుతో కాలయాపన చేస్తూ మెడికల్ బోర్డు సమావేశాలను నిర్వహించడంలో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2000 మంది అనారోగ్యంతో ఉన్న కార్మికులు మెడికల్ బోర్డు కోసం ఏడాదికి పైగా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ మెడికల్ బోర్డు లేకపోవడంతో వలంవురం కార్మికులు దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంస్థలో జరుగుతున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై కార్మికులు మేల్కొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థను పరిరక్షించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సింగరేణి భవన్, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మార్చి 28న అన్ని మైన్స్, విభాగాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, మార్చి 30న కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ముందు భారీ నిరసన చేపట్టానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీకే-5 ఇంక్లైన్ మైన్ పిట్ సెక్రటరీ నమిల్ల వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్, కాగితపు విజయ్, మాదాసు ఈశ్వరరావు, మారపాక తిరుపతి, గిన్నారపు మహేందర్, బాలాజీ, మల్లారపు సూరజ్, జిమ్మిడి అనుదీప్, కంచర్ల రాజేష్, మహమ్మద్ అన్వర్, విజయభాస్కర్, మద్దెల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.




# సీతారాముల కల్యాణం లోక కల్యాణానికి ప్రతీక

**- భక్తిభావంతో జరుపుకునే పండుగలు మానసిక ప్రశాంతతను ఇస్తాయి**
**- నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**
**- ఉత్సవ కమిటీల కృషి అభినందనీయం-రామయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**
**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : సీతారాముల కల్యాణం లోక కల్యాణానికి ప్రతీక అని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పలు మండపాలు, దేవాలయాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌లతో కలిసి ఆయన సందర్శించి సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఇంత ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. శ్రీరామ నవమి వేడుకలు సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయనఅభిప్రాయపడ్డారు. భక్తిభావంతో జరుపుకునే ఇటువంటి పండుగలు ఒత్తిడితో కూడిన నేటి జీవనశైలిలో మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆశ్రీరామచంద్రుని కృపతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈవేడుకల విజయవంతానికి ప్రతి మండపాలు, దేవాలయాల వద్ద వద్ద ఉత్సవ కమిటీలు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అనంతరం ప్రసాద పంపిణీని ప్రారంభించారు. మండపాలు, ఆలయాల సందర్శన అనంతరం ఆయన నేరుగా భద్రాచలంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మం-బస్తర్ కారిడార్ ను నాలుగు లైన్లుగా విస్తరించాలి

**పార్లమెంటులో కేంద్రానికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : తెలంగాణ, మధ్య భారతానికి వ్యూహాత్మక జీవనాధారమైన ఖమ్మం- బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. తూర్పు తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో అనుసంధానం, భద్రత, ఆర్థికాభివృద్ధిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపే ఒక కీలకమైన మౌలిక సదుపాయాల లోపం గురించి దృష్టి సారించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హై-స్పీడ్ కారిడార్ల ద్వారా హైదరాబాద్ నుండి ఖమ్మం వరకు ఉన్న రహదారి మార్గంలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తున్నదన్నారు. అయితే, ఖమ్మం వెలుపల కొత్తగూడెం-భద్రాచలం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల అనుసంధానం నిర్లక్ష్యానికి గురైందన్నారు. వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన ఒక జీవనాడి అని, దీనిని ఒడిషా వైపు కూడా అనుసంధానం చేయొచ్చని ఎంపీ రవిచంద్ర తెలిపారు.రాజ్యసభలో శుక్రవారం ఆయన జీరో అవర్ లో మాట్లాడుతూ, ఈ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదని,ఇది తెలంగాణ- ఛత్తీస్‌గఢ్-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే వ్యూహాత్మకమైనదని చెప్పారు. ఈ నెట్‌వర్క్‌కు కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు. సింగరేణి బొగ్గు క్షేత్రాలు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ప్రధాన పరిశ్రమలకు నిలయమైన కొత్తగూడెం-పాల్వంచలు తెలంగాణ పారిశ్రామిక, ఇంధన వెన్నెముకగా ఉన్నాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నా కూడా ఖమ్మం దాటాక ఈ ప్రాంతంలో రహదారి మౌలిక సదుపాయాలు సరిగా లేవని ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనాలు తరుచూ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకోవాల్సి వస్తున్నదని వివరించారు.ఖమ్మం-కొత్తగూడెం-భద్రాచలం-బస్తర్ కారిడార్ ను వెంటనే నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నాలుగు లేన్ల కారిడార్ కొత్తగూడెంను త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రంగా రూపుదాల్చి రాష్ట్రాల మధ్య బొగ్గు, ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల నిరాటంక రవాణాను సులభతరం చేస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఈ రహదారి అత్యంత గిరిజన, వెనుకబడిన ప్రాంతాల గుండా వెడుతుందని, ఈ అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ వర్గాలను ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయొచ్చని,విద్య, ఆరోగ్య సంరక్షణ, మార్కెట్లను మరింత మెరుగుపరుస్తుందని చెప్పారు. బస్తర్, సుక్మా వైపు విస్తరించి ఉన్న ప్రాంతాలతో సహా ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతమని, మౌలిక సదుపాయాలు కేవలం అభివృద్ధి మాత్రమే కాదు అని,అవి భద్రతా దళాలకు, పరిపాలనకు, స్థిరత్వానికి ఒక వ్యూహాత్మక అవసరం అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అదనంగా ఈ కారిడార్ హైదరాబాద్ నుండి బస్తర్ అనుసంధాన్ని మరింత బలోపేతం చేసి, దీనిని ప్రత్యక్ష ఆర్థిక, మానవతా జీవనాడిగా మారుస్తుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఖమ్మం వరకు పటిష్టమైన కారిడార్లను నిర్మించామని, అత్యంత కీలకమైన లోపించిన అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ దార్శనికతను పూర్తి చేయాల్సి ఉందని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు. ఈ కారిడార్ ఆర్థిక, సామాజిక వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, దీనిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు.దీంతో, మూడు రాష్ట్రాల అనుసంధానానికి, అభివృద్ధికి కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఆవిర్భవిస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు.



# అనంతారంలో వైభవంగా శ్రీరామనవమి కల్యాణం

**- నాలుగు దశాబ్దాలుగా సంప్రదాయం కొనసాగింపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మార్చి 27 : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో శ్రీరాముడి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లెపాటి నాగరాణి రాజలింగం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పకీర్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా గ్రామంలో ఐక్యమత్యంతో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. ఈ వేడుకలు చారిత్రాత్మక ప్రాధాన్యం సంతరించుకుని ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. పురోహితులు ధూళిపాల శ్రీనివాస శర్మ మాట్లాడుతూ గ్రామంలోని బండపై ఉన్న చెలిమి నీరు సంవత్సరం పొడవునా నిల్వ ఉండటం విశేషమని చెప్పారు. దైవసంకేతంతో ఆలయం నిర్మాణం జరిగిందని, అప్పటి నుంచి ఈ క్షేత్రం మహిమాన్వితంగా మారి భక్తుల మొక్కులు నెరవేరుతున్నాయనే విశ్వాసం నెలకొన్నదని వివరించారు. వేడుకల అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతల వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ వడ్డబోయిన వెంకటేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా సీతారాముల కళ్యాణ ఉత్సవాలు

**- ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 27 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారాం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ సర్కిల్లో జరిగిన శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణం, శ్రీరాముని ఉత్సవాలలో ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ,హాజరై సీతారాముల కళ్యాణం తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని అదేవిధంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతో షంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# కన్నుల పండుగగా శ్రీరామనవమి ఉత్సవాలు

**- ఉత్సవాలలో పాల్గొన్న చెరుకుపల్లి భరత సింహారెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


మేడ్చల్ మల్కాజిగిరి, మార్చి 27 : శ్రీరామనవమి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని శ్రీని ఎంక్లేవ్, రామ్ రాజ్ నగర్, (సుచిత్ర), వెంకటేశ్వర కాలనీ (ఈస్ట్), వెంకటేశ్వర కాలనీ(వెస్ట్), ఐ.డి.పి.ఎల్(క్రితుంగ రెస్టారెంట్), గణేష్ నగర్,ద్వారక నగర్, చెరుకుపల్లి కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ ,భీమా ప్రైడ్ అపార్ట్మెంట్, ఆర్.వి.అత్విక్ అపార్ట్మెంట్, జెడ్.ఆర్.వియారీ అపార్ట్మెంట్, గార్డెన్ బస్తీ, కుత్బుల్లాపూర్ గ్రామం, వెంకటేశ్వరనగర్‌లలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ కమిటీ సభ్యులు, నిర్వహించిన శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవం కార్యక్రమం లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి, చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమం లో బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, నీరుడు శ్రీనివాస్

# మెదక్ కోదండ రామాలయం కళ్యాణోత్సవంలో రామ తీర్థం వితరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మార్చి 27 : శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం రాములోరి కళ్యాణోత్సవం జరిగింది.కన్నులపండువగాజరిగిన సీతారాముల కళ్యాణోత్స వానికి తరలివచ్చిన భక్తులకు బండ నరేష్ రామతీర్థం (బెల్లం పాయసం) వితరణ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల దాహార్తి తీర్చడానికి బెల్లం పాయసం అందించడం చాలా సంతోషానిచ్చిందని నరేష్ పేర్కొన్నారు. రాములోరి సేవలో తరించడంతో మరువలేని ఆనందాన్నిచ్చిందని నరేష్ పేర్కొన్నారు.సహకరించిన భక్తులు, మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





# భద్రాద్రి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్ ముదల్కర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం రాత్రి 11 గంటల వరకు ఓట్లు లెక్కింపు జరపగా అధ్యక్షుడిగా కిరణ్ కుమార్ ముదల్కర్ ఎన్నిక అయ్యారు.ఉపాధ్యక్షురాలు-1గా షాజహాన్ పర్వీన్, ఉపా ధ్యక్షుడు-2గా కాటూరి సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా గడిపల్లి మహేశ్వర రావు, సంయుక్త కార్యదర్శిగా గడదాసు నాగరాజు, గ్రంథాలయ కార్యదర్శిగా దొడ్డ ప్రసాద్, కోశాధికారిగా జి.సంధ్యారాణి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిలుగా బానోతు దేవదాస్, నకిరేకంటి ఉమలు గెలుపొందారు. 328 ఓట్లకు గాను 309 ఓట్లు పోలయ్యాయి. మహిళా రిప్రజెంటేటివ్ గా మల్లెల ఉషారాణి ఏకగ్రీవంగా ఎన్నిక అయిన విషయం విధితమే.

# కొత్తగూడెం (భద్రాచలం రోడ్) స్టేషన్‌కు రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి: బీఆర్ఎస్ ఎంపీలు

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం - చారిత్రక ప్రాధాన్యాన్ని వివరించిన నేతలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, మార్చి 27 : తెలంగాణలోని కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్‌కు ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కే.ఆర్. సురేష్ రెడ్డిలు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ, కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ మూలాలు 1932లో బ్రిటిష్ కాలానికి చెందినవని తెలిపారు. సింగరేణి బొగ్గు క్షేత్రాల అభివృద్ధి కోసం ఈ స్టేషన్‌ను కీలకంగా అభివృద్ధి చేశారని వివరించారు. బొగ్గు రవాణా కేంద్రంగా దేశ విద్యుత్ ఉత్పత్తికి ఈ ప్రాంతం దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ కార్యకలాపాలకు ఈ స్టేషన్ ప్రధాన కేంద్రంగా ఉండి, భారతీయ రైల్వే సరుకు రవాణా ఆదాయానికి ముఖ్య ఆధారంగా నిలుస్తోందని ఎంపీలు వెల్లడించారు. ఇంత గొప్ప చారిత్రక వారసత్వం ఉన్నప్పటికీ, భారతీయ రైల్వే చరిత్రలో ఈ స్టేషన్‌కు తగిన గుర్తింపు లభించలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగూడెం ప్రాంతం తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే ప్రధాన రైల్వే కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. కొత్తగూడెం--కిరండోల్, మల్కన్‌గిరి--భద్రాచలం, జునాగఢ్--మల్కన్‌గిరి--భద్రాచలం కారిడార్, అలాగే కొత్తగూడెం--సత్తుపల్లి--కొవ్వూరు మార్గాల వంటి ప్రాజెక్టులను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. 2032లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ శతాబ్దాన్ని చేరుకోనున్న నేపథ్యంలో, ఈ చారిత్రాత్మక కేంద్రానికి తగిన గుర్తింపు కల్పించాలని ప్రజల ఆకాంక్షను ఎంపీలు వెల్లడించారు. రైల్వే డివిజన్ ఏర్పాటు ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని, మౌలిక సదుపాయాలు బలోపేతం అవుతాయని, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. కొత్తగూడెంను రైల్వే డివిజన్‌గా ప్రకటించే దిశగా సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని తక్షణమే ప్రారంభించాలని ఎంపీలు మంత్రి వద్ద విజ్ఞప్తి చేశారు. శతాబ్ద కాలంగా దేశ ఇంధన అవసరాలకు సేవలందిస్తున్న ఈ ప్రాంతానికి తగిన గుర్తింపు, పెట్టుబడులు, సంస్థాగత హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# పశ్చిమాసియాలో ఘర్షణలు

## - హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల - తాజా పరిస్థితులపై సిఎంలో ప్రధాని మోడీ చర్చ



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 27 : పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉ భయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలి



- ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు,
- తలంబ్రాలు వేములవాడలో అందజేత

(ప్రజాలక్ష్యం న్యూస్ ప్రతినిధి)

వేములవాడ, మార్చి 27 : శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శ్రీ రామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజి వద్ద శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించామని తెలిపారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు.

**వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం: ప్రభుత్వ విప్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజీ వద్ద శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణం సంప్రదాయంగా వస్తుందని వివరించారు. కల్యాణానికి 50వేల భక్తులు వస్తారనే అంచనా మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పందిళ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. నూతన వేదిక వద్ద శ్రీ శివ, శ్రీ సీతారాముల కల్యాణం వేడుకలు దేవాదాయ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. శ్రీ సీతారాముల ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

# రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, మార్చి 27 : నల్గొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి వచ్చే సంవత్సరం శ్రీరామనవమి నాటికి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం నల్గొండ పట్టణంలోని రామగిరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో మంత్రి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రామగిరి దేవాలయానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తారని చెప్పారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వైకుంఠ దర్శనం, ఉత్తర ద్వార దర్శనం వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దర్శన మార్గాల విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటికే చర్చలు జరుపుతున్నామని, నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రామగిరి రామాలయానికి గొప్ప చరిత్ర ఉ ందని గుర్తుచేస్తూ, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే, దేవాలయ భూములకు ఇబ్బంది కాకుండా నేషనల్ హైవే మార్గాన్ని బైపాస్ ద్వారా మళ్లించామని పేర్కొన్నారు. నల్గొండ పట్టణ ప్రజలు శ్రీరాముని కృపతో సుఖ : సంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి సహకారంతో రామగిరి రామాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఉత్తర ద్వార దర్శనానికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, కార్పొరేటర్లు, భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు

# వైద్యులు ప్రజలకు బాధ్యతతో నాణ్యమైన చికిత్స అందించాలి

- రోగులతో ఆప్యాయ పలకరింపు - చికిత్సపై వివరాల సేకరణ - సిబ్బంది హాజరు రికార్డుల పరిశీలన
- పరిశుభ్రత, మందుల నిల్వలపై ప్రత్యేక దృష్టి - నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరిక
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, మార్చి 27 : ప్రజలకు వైద్యులు మెరుగైన చికిత్సను అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం, జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రం పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల గది, ల్యాబ్, ఇన్ పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి, రోజూవారి రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే తరచూ వచ్చే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సమయానికి సరైన చికిత్స అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి విభాగం శు భ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు (అటెండెన్స్) రికార్డులను తనిఖీ చేసి, విధుల్లో గైర్హాజరు (లేదా) అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల నిల్వలను పరిశీలించి, ప్రభుత్వ ఆసుపత్రులు నాణ్యమైన, సమయానుకూల వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ఉండాలని, టీకాలు, అత్యవసర ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అదే విధంగా ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో ఆప్యాయంగా పలకరించారు. ఏమైంది తాత? ఎలా ఉంది ఇప్పుడు? ఎప్పుడు ఆసుపత్రిలో చేరావు? అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర

- యాత్రను ప్రారంభించిన గవర్నర్ శుక్లా
- బందోబస్తు పర్యవేక్షించిన సిపి సజ్జన్నార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మార్చి 27 : హైదరాబాద్ నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్రను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఇది కొనసాగనుంది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైందని.. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడిగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తి భావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రాములోరి కల్యాణాలు, శోభాయాత్రలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నల్లకుంటలోని పాత రామాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడారు. నగరంలో దాదాపు 339 ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే శోభాయాత్రకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. అనుకున్న సమయానికి శోభాయాత్ర పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇతర పండుగలకు ప్రజలు సహకరించిన విధంగానే శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని సజ్జనార్ కోరారు.





# స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి, విప్

- భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, మార్చి 27 : శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు మంత్రిని ఆలయ అతిథి గృహంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఆద్వర్యంలో శివార్చన స్టేజీ వద్ద నిర్వహించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేసేందుకు వచ్చి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శ్రీ సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మంత్రి, ప్రభుత్వ విప్ నకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు,తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

- ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రాజన్న సిరిసిల్ల, మార్చి 27 : జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# వరంగల్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, మార్చి 27 : కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందాడు. రైలు కింద పడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు క్రీమ్ కలర్ ఫార్మల్ ప్యాంట్, యాష్ / బ్లూ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు వర్ణం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతి పైన ఇంగ్లీష్ పచ్చబొట్టు తప్ప మరే ఇతర ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు. 9701747014, 8712658627 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## సీఎం కు స్వాగతం పలికిన భద్రాద్రి జిల్లా కాంగ్రెసు నాయకులు నాగా సీతారాములు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : శ్రీరామ నవమి ఉత్స వాలలో పాల్గొనేందుకు శుక్రవారం భద్రాచలం వచ్చిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి భద్రాద్రి జిల్లా కాంగ్రెసు నాయకులు హెలి ప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. ముందుగా ఐటీసీ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ లో దిగిన సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు శాలువాతో సత్కరిం చి, పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ని ఆత్మీయంగా పలకరించి కుశలప్రశ్నలు వేశారు. కాంగ్రెసు నాయకులు కోనేరు సత్యనారాయణ, బిక్కసాని నాగేశ్వర రావులు స్వాగతం పలికారు.

## గోదావరి నదిలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన డిడిఆర్ఎఫ్ బృందం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భద్రాచలంలో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం గోదావరి వద్ద స్నానానికి వెళ్లిన హైదరాబాద్ కి చెందిన ఉదయ్ అనే యువకుడు ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడటం జరిగింది. ఆ సమయంలో అక్కడే విధు లలో ఉన్న డీడీఆర్ఎఫ్ సిబ్బంది,స్థానిక ఈతగాళ్లు వెంటనే స్పందించి బాదితుడిని రక్షించి అంబులెన్స్‌లో హాస్పటల్‌కి పంపడం జరిగింది. ఆపదలో ఉన్న వారిని సంరక్షించడానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీ డీ ఆర్ ఎఫ్ ) బృందం ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడటంతో అక్కడే ఉన్న స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన ఎన్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులైన ఆరెఎస్సై సుమంత్, కానిస్టేబుళ్ళు రమేష్, వినోద్ కుమార్, రాజేష్, ఫరీద్ బాబు, జమలయ్య, సాయి ఫణింద్ర, అనిల్ కుమార్‌లను ఎస్పీ బి.రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.



## శ్రీ రామ నవమి సందర్భంగా పానకం, మజ్జిగ పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27: శ్రీ రామ నవమి సందర్భం గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లోని సూపర్ బజార్ సెంటర్ లో ప్రముఖ హోటల్ శ్రీ బాలాజీ టిఫిన్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం వచ్చి వెళ్లే భక్తులకు, అందరికీ పానకం, మజ్జిక పంపిణీ చేశారు.



## బొమ్మనపల్లి లో ఘనంగా శ్రీ సీతారాములకళ్యాణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భద్రాద్రి జిల్లా ఇల్లెందు నియోజకవర్గం పరిధిలోని టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ శ్రీ సీతా రాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి పూజ లో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. హాథీరామ్ నాయక్, గ్రామ పెద్దలు వాంకుడోత్ రత్నా నాయక్, వశ్యా నాయక్, గూగులోత్ హేమచందర్, నూనావత్ బాలు, బానోతు చిన్న, ఉద్యోగులు రమేష్ బాబు, రవి, రమేష్,ప్రభాకర్, బాలకృష్ణ కుమార్, యువకులు వంశీ, రవి, పొట్టి నిఖిల్ పవార్, మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

## ఖమ్మం జిల్లాలో పలువురు తహసీల్దార్ లు బదిలీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మార్చి 27 : రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ స్థాయి అధికారులను బదిలీలు చేశారు. ఖమ్మం జిల్లాలో ఎన్నో రాజకీయ ట్విస్టుల తరువాత పదిమంది తహసీల్దారులకు స్థాన చలనం కలిగింది. ముఖ్యంగా జిల్లాలోని ఓ తహసీల్దార్ బదిలీ విషయంలో జిల్లాకు చెందిన ఓ మంత్రి ప్రధాన అనుచరులు వ్యక్తిగత వైరుధ్యాలు పక్కనబెట్టి చివర వరకు ప్రయత్నాలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిడుల కారణంగా బదిలీల లిస్టు విడుదల చేయడంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, అంతిమంగా పదిమంది ఎమ్మార్వోలను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరచూ ఇలాంటి బదిలీలు చేపట్టడం సహజమని,ఇటీవలి కాలంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అధికారుల మార్పులు జరిగినప్పటికీ ఖమ్మం జిల్లాలో ఎలాంటి మార్పులు జరగలేదు దానిలో భాగంగానే తహసీల్దారుల బదిలీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

## నేడు భద్రాచలం రానున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం నాడు భద్రాచలం రానున్నారు. భద్రాచలంలో జరగనున్న శ్రీ రామ పట్టాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గవర్నర్ భద్రాచలం పర్యటనలో పాల్గొని, తిరిగి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ కు వెళ్ళానున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

## శ్రీరామ నవమి వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మార్చి 27 : శ్రీరామా నవమి దేశానికి ఐక్యత, ధర్మబలం అందించాలని ప్రతి పౌరుడు సుఖశాంతులోషాలతో ఉండే విధంగా శ్రీ రాముణ్ణి ఆశీస్సులు ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈరోజు పలు ఆలయాలలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనపర్తి పట్టణంలో గల సాయి నగర్ కాలనీలో( రామాలయం ) ఉన్న శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో అలాగే పట్టణంలో, మర్రికుంట, లక్ష్మీ నరసింహ కాలనిలో, కే డి అర్ నగర్ లో, రాజానగరం లో, నాగవరంలో, పీర్ల గుట్టలో, 23వ వార్డులో, బాలానగర్(రామ్ నగర్) లో, గాంధీనగర్ ప్యాటగడ్డ రామలింగేశ్వర స్వామి దేవస్థానం లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్నికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి భక్తులతో ముచ్చటించి అన్న ప్రసాద స్వీకరించారు. మాజీ మంత్రి వెంట జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నీలస్వామి, గులాం ఖాదర్, విష్ణు సాగర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కౌన్సిలర్ స్వాతి హరిబాబు, శిరీష రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద,విజయ్ నిర్మలమ్మ, నాగన్న యాదవ్,స్టార్ రహీం, దీ=చా సోషల్ మీడియా అధ్యక్షులు సునీల్ వాల్మీకి, గౌడ నాయక్, చిట్యాల రాము, కుమ్మరి యాదమ్మ సత్యం, రమేష్ నాయక్, బాలరాజు, ఆరిఫ్, ఖని పాషా, సుధాకర్, వెంకటేశ్వర్ గౌడ్, పెద్దముకుల రవి, కరుణాకర్, వెంకట్ స్వామి, భాను నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో ఫ్లెక్స్ ప్రింటింగ్ యజమానిపై సీపీఐ దాడి

### పోలీస్ కేసు నమోదు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భద్రాద్రి జిల్లా కొత్తగూడెం పట్టణంలోని ఎంజీ రోడ్డులో ఉన్న ఆదిత్య ఫ్లెక్స్ ప్రింటింగ్ యజమాని మల్లికార్జున్ పై గురువారం రాత్రి 10:45 గంటల సమయంలో దాడి జరిగింది. సిపిఐ పార్టీకి చెందిన వారిగా బాధితుడు ఆరోపిస్తున్న యాకూబ్, మరో ఇద్దరు యువకులు "కాంగ్రెస్ పార్టీ బ్యానర్లే పెడతావా? మా బ్యానర్లు పెట్టవా" అంటూ అకారణంగా దాడి చేశారని, ఎంత నచ్చ చెప్పిన వినిపించుకోకుండా మద్యం మత్తులో ఉన్న వారు తనను ఇష్ట రాజ్యాంగా చితకబాదారని మల్లికార్జున్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన కొత్తగూడెం ప్రాంతంలో శాంతిభద్రతలకు సవాలుగా మారింది. ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమాని మల్లిఖార్జున్ ముందు ఎవరు ఆర్డర్ ఇస్తే వాళ్ళ కే హోర్డింగ్స్ ఇస్తామని చెప్పినా, "కాంగ్రెస్ పార్టీ వాళ్ళకే ప్రాధాన్యం ఇస్తావా? అంటూ చితక బాధి, పెట్రోల్ పోసి షాప్ తగుల పెడతాం, నిన్ను చంపేస్తాము" అంటూ కొట్టి, బెదిరం

## కొత్తగూడెం గీతాంజలి స్కూల్ లో ఈనెల 29న రెండు జిల్లాల స్థాయి చెస్ పోటీలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని గీతాంజలి పబ్లిక్ స్కూల్ లో ఈనెల 29వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు గీతాంజలి స్కూల్ చైర్మన్ డా.వి సుబ్బారావు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు 30 ట్రోఫీలతో,పాటు ప్రతి ఒక్కో క్రీడాకారుడికి మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందజేయున్నట్లు తెలి పారు. ఇందులో 15 బాలికలకు, 15 బాలురకు, అండర్ 15, అండర్ 12, అండర్ 9 విభాగంలో వారికి బహుమతులను అందజేస్తారు. ఈ పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో జరుగుతాయని ఇంటర్నేషనల్ చెస్ ప్లేయర్ సిహెచ్ గోపికృష్ణ తెలిపారు. పోటిల్లో పాల్గొనే వారు 9440162749, 9182225496 సెల్ నెంబర్లకు ఫోన చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మధ్యాహ్నం భోజనం సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ ఓన్ చెస్ బోర్డ్స్ ను తమ వెంట తీసుకురాగలరని ఆదివారం ఉదయం 9 గంటల లోపు గీతాంజలి పబ్లిక్ స్కూల్ గౌతమ్ నగర్, కొత్తగూడెం రావాల్సిందిగా కోరారు. ఈ పోటీలలో ఓడిపోయిన, గెలిచిన ప్రతి ఒక్కరు 5 రౌండ్లు ఆడవలసిందిగా చెస్ కోచ్ సీహెచ్. బిశ్వజిత్ కృష్ణ తెలిపారు.



## పండగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి

### - నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మార్చి 27 : భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని నేతాజీ యువజన సంఘం, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ అన్నారు. శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు ఎస్.జె.కె.అహ్మద్ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనాదిగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలు, ఉత్సవాలను ఐక్యమత్యంతో జరుపుకోవడం ద్వారా మానవ సంబంధాలు మరింత బలపడతాయని అన్నారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నేటి యువత కులమత భేదాలను విడనాడి, అందరితో స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం సభ్యులు ఏవి రాఘవ, ఓం ప్రకాష్, రామినాయుడు, పి.ప్రసాద్, జిల్లేపల్లి స్టాలిన్,సయ్యద్ అంజద్, సిద్దా రెడ్డి, వేలాద్రి, సయ్యద్ నూర్జహాన్ పర్వీన్, టి.వరలక్ష్మి, సక్కుబాయి, విజయ, మదీనా, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.


## పాపన్నపేట మండలంలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

### బండ్ల ఊరేగింపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మార్చి 27 : మండల కేంద్రమైన పాపన్న పేట,లక్ష్మీనగర్,గాజుల గూడెం,మల్లంపేట,నాగ్స న్ పల్లి గ్రామలలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు శుక్రవారం కన్నుల పండుగగా శోభాయమానంగా నిర్వహించారు. ఈకళ్యాణ మహోత్సవానికి ఏడుపాయల దేవస్థానం తరపున సీతారాముల కళ్యాణనికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ అధికారులు అర్చకులు శంకర్ శర్మ సూర్య శ్రీనివాస్ వారికీ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు వారికీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,గజవాడ రాజేశ్వర్,మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, దంపతులు సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు చెరువు పల్లి విశ్వనాథశర్మ మంత్రోచ్చారణలమధ్య కళ్యాణ రాముడి కళ్యాణ మహోత్సవం జరుగుతుండగా గ్రామ మహిళలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవం తిలకించి తరించి పోయారు. అనంతరం తూర్పు రాజారాం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



**వెంకటేశ్వర స్వామికి బండ్ల ఊరేగింపు**


శ్రీరామ నవమి పురస్కరించుకొని మండల కేంద్రమైన పాపన్నపేట వెంకటేశ్వర స్వామి కి బండ్ల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు పెద్దా సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని బండ్ల ఊరేగింపు కార్యక్రమం తిలకించారు.

## "బచ్చుగూడెంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం

### - కౌన్సిలర్ లకడారం సరిత బుజంగం రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు"

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


పటాన్‌చేరు, మార్చి 27 : ఇంద్రేషం మున్సిపాల్ పరిధిలోని బచ్చుగూడెం వార్డులోని శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ లకడారం సరిత బుజంగం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కన్నుల పండుగగా కళ్యాణ ఘట్టం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బచ్చుగూడెం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై సీతారాముల విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని జరిపించారు. కౌన్సిలర్ లకడారం సరిత బుజంగం రెడ్డి దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వార్డు ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. కళ్యాణం అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లకడారం సరిత బుజంగం రెడ్డి మాట్లాడుతూ.. "వార్డు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రతి ఏటా ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. సీతారాముల ఆశీస్సులు మన బచ్చుగూడెంపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ వేడుక విజయవంతం కావడానికి సహకరించిన వార్డు పెద్దలకు, యువతకు అలాగే భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు," అని తెలిపారు.



## ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామచందర్‌కు ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


గోదావరిఖని టౌన్, మార్చి 27: ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామచందర్‌ను సింగరేణి ఈపి అపరేటర్స్ అసోషియేషన్ ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. అడ్వకేట్ మేకల మల్లేశం బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం సింగరేణి ఈపి ఆపరేటర్స్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శి ఐరేని ఉదయ్ కుమార్, కూచన అశోక్ శాలువతో పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.



## వేంసూరులో అంగారంగా వైభవంగా రాములోరి కళ్యాణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మార్చి 27 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోని వేంసూరు మండలం వెంకటాపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతాదేవి సమేతశ్రీ రాముల వారి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణం కార్యక్రమంలో గొర్ల నరసింహారెడ్డి మధురవాణి దంపతులుచే కళ్యాణం నిర్వహించారు అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకహాహాఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ,గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



## కన్నులపండువగా సీతారాముల కళ్యాణోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజున కన్నులపండువగా సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్- డిసిసి అధ్యక్షురాలు డాక్టర్ ఉమా దంపతులు ముత్యాల తలంబ్రాలు తెచ్చినారు. సీతారాముల విగ్రహాలను కళ్యాణ వేదికపై స్వాగతించి అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణ పండితులచే సీతారాముల కళ్యాణం నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్యే దంపతులకు స్వామి వారి ఆశీర్వాదన్ని తీసుకొని తీర్ధ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవంలో మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి-రమేష్ దంపతులు, మున్సిపల్ కౌన్సిలర్ అజయ్ సారధి రెడ్డి,పలువురు పుర ప్రముఖులు,ప్రజాప్రతినిధులు,వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## శివాలయానికి కుర్చీలు కార్పెట్లు పంపిణి

- ఇస్నాపూర్ ఆలయ అభివృద్ధిలో
- భాగస్వామ్యం కావడం సంతోషకరం
- ఇస్నాపూర్ 12వ వార్డు కౌన్సిలర్ కిషోర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు, మార్చి 27 : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని స్థానిక శివాలయంలో భక్తుల సౌకర్యార్థం మున్సిపల్ కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి ఉదారత చాటుకున్నారు. పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో, మచ్చ కిషోర్ రెడ్డి ఆలయానికి అవసరమైన కుర్చీలను, కార్పెట్లను డొనేట్ చేసి, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. పరమశివుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అనుకూలంగా ఉండేలా ఈ వస్తువులను అందజేసినట్లు తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని, శివయ్య సేవ చేసుకునే భాగ్యం కలగడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురపురాజు శ్రీనివాస్ రావు, ఆలయ అర్చకులు రోహిత్, బీఆర్ఎస్ నాయకులు సాయి కుమార్, దీపక్ గౌడ్, సుల్తాన్ పురం దయాకర్, సాయి వెంకట్ ఇతర ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రవాస తెలుగు మహిళకు అరుదైన గౌరవం

### - యూకేలోని వార్విక్ డిస్టిక్ట్ క్రౌన్సిల్‌కు హేమ ఎంపిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, మార్చి 27 : హనుమకొండకు చెందిన ప్రవాస భారతీయురాలు హేమ ఎల్లాప్రగడ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యూకేలోని వార్విక్ డిస్టిక్ట్ కౌన్సిల్‌కు 2023లో అధికార గ్రీన్ పార్టీ సభ్యురాలిగా ఎన్నికైన ఆమె తాజాగా క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికయ్యారు. స్థానిక నగరాల్లో పాలన సాగించేందుకు డిస్టిక్ట్ కౌన్సిల్స్ ఉంటాయి. డిస్టిక్ట్ కౌన్సిల్‌లో అత్యధిక స్థానాలు గెలుపొందిన పార్టీ నేతను లీడర్ ఆఫ్ ది కౌన్సిల్‌గా పిలుస్తారు. సభ్యుల్లో కొందరిని క్యాబినెట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపిక చేసి వివిధ పరిపాలనా విభాగాలను అప్పగిస్తారు. అలాగే హేమ ఎల్లాప్రగడకు ఇప్పుడు డీకార్బనైజేషన్ బాధ్యతలు అప్పగించారు.

# గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రతి మండల కేంద్రానికి ఆర్టీసి బస్సుల సౌకర్యం



### - రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మార్చి, 27 : వనపర్తి నియోజకవర్గంలోనీ ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించేందుకు వనపర్తి ఆర్టిసి డిపోకు కొత్తగా 20 =జ బస్సులు కావాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గారి అధ్యక్షతన అసెంబ్లీ హాల్ 1 లో నిర్వహించినా ప్రత్యేక సమావేశంలో పలువురు ఎమ్మెల్యే ఆర్ టీ సి యాజమాన్యం, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ....వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో బస్టాండ్ వైపు రోడ్డులో డిపో గోడలకు అనుసంధానంగా ఉన్న చిరు వ్యాపార సముదాయాలను, వెనకాలకు జరిపి కట్టుకునే విధంగా చేసి రోడ్డు వెడల్పుకు ఆర్టీసీ డిపో యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.వనపర్తి జిల్లా కేంద్రంలో 20 ఎకరాలలో కొత్త బస్ డిపో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత డిపో స్థలంలో పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వనపర్తి డిపోకు కొత్తగా 20 బస్సులను మంజూరు చేయాలని మంత్రి కోరారు. వనపర్తి పట్టణంలో రెండు మినీ బస్సులను (సిటీ బస్సు మాదిరిగా) ఏర్పాటు చేయాలని దీంతో వనపర్తి లోని విద్యార్థులకు వ్యాపారస్తులకు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుంచి ఆయా మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వయా యాపర్ల గుమ్మడం, గుమ్మడం తండా, చిన్న గుమ్మడం కలుపుతూ ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే వనపర్తి నుంచి వయా మానాజిపేట్ మహబూబ్నగర్కు నాలుగు ట్రిప్పులు అదనంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.వనపర్తి - పెద్దమందడి మండల కేంద్రానికి షటిల్ బస్ ఏర్పాటు చేసి రోజు పది ట్రిప్పులు తిరిగేలా చూడాలన్నారు. వనపర్తి జిల్లా రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్యాలయానికి ( =ూ )నూతన భవన నిర్మాణం కోసం అప్పయ్యపల్లి దగ్గర కేటాయించిన స్థలంలో వెంటనే కార్యాలయ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకోరారు. అదేవిధంగా వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో నిర్మించనున్న జజ బెడ్ లకు సంబంధించి వనపర్తి బస్టాండ్ కు 2.50 కోట్లు మంజూరు అయి ఉన్నాయని, అదేవిధంగా పెబ్బేరు బస్టాండ్ లోని ఎఎ బెడ్ నిర్మాణా నికి రూ. 1. 20 కోట్ల రూపాయలు మంజూరై ఉన్నాయని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# జాతీయ స్థాయి 'ఎక్స్ప్లోరా' పరీక్షలో ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం




### - 360 పాఠశాలలు, 12,000 మంది విద్యార్థుల మధ్య జరిగిన పోటీలో 180 మంది విజేతలు

### - విజేతలను అభినందించిన మాజీ ఐఏఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ శాస్త్రవేత్త కిషోర్ నాథ్.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్చేరు, మార్చి 27 : హైదరాబాద్లోని రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి 'ఎక్స్ప్లోరా' విద్యా పోటీలలో ముత్తంగి గ్రేటర్ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిసి పాఠశాల ఖ్యాతిని చాటారు.దేశవ్యాప్తంగా సుమారు 360 ప్రముఖ పాఠశాలల నుండి 12,000 మంది విద్యార్థులు ఈ ఎక్స్ప్లోరా పరీక్షలో పాల్గొన్నారు. అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థుల మధ్య జరిగిన పరీక్షలో కేవలం 180 మంది విద్యార్థులు మాత్రమే విజేతలుగా నిలిచారు. ఇందులో ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్కు చెందిన 9 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి రికార్డు సృష్టించారు.విజేతలుగా నిలిచిన విద్యార్థులు పి. అనుశ్రీ, దివ్యాన్ సింగ్ , సి.హెచ్.లౌక్య, హిమ బిందు, కే. తను శ్రీ, బి.చరిత, బి.హరిత, కే. ఆదిత్య, ఆర్. సాయి చరణ్ రెడ్డి. విజేతలు గా నిలిచారు. అనంతరం రవీంద్ర భారతిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, కృష్ణవేణి స్కూల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ రాజు సంగాని, అలాగే డి.ఆర్.డి.ఓ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ నాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఇటువంటి జాతీయ పోటీలలో పాల్గొనడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, పోటీ ప్రపంచంలో నెగ్గుకురావడానికి ఇది పునాది అని పేర్కొన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు చూపిన ప్రతిభను వారు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, అలాగే సహకరించిన తల్లిదండ్రులను ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి హెచ్.రాజేష్ తెలిపారు.

# బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




బెల్లంపల్లి మార్చి 27 : మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణ లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని, ఈ మేరకు మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించేందుకు డి ఎం ఎఫ్ టి నిధుల నుండి ఆటోలు అందించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి సి.ఎస్.ఆర్. నిధుల నుండి 2 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యుత్ బిల్లులు తగ్గించే ఆలోచనలో భాగంగా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు పనులు కొనసాగుతున్నాయని, ముల్కల్ల నుండి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో సిబ్బంది కొరత ఉ న్నట్లయితేహొహొసమకూర్చుకునేందుకు పాలకవర్గం సమన్వయంతో చర్యలు తీసుకోవచ్చని, ప్లాస్టిక్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలో షాపులు తీసుకున్న వారి వద్ద నుండి అద్దె క్రమం తప్పకుండా వసూలు చేయాలని, ఖర్చులు తగ్గించి ఆదాయం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 32 కోట్ల 42 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4 కోట్ల 77 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం ( గ్రాంట్లు కాకుండా), 26 కోట్ల 28 లక్షల రూపాయల గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 55 లక్షల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 1 సంవత్సర కాలంలో మురికివాడలను పూర్తిగా అభివృద్ధి చేసే విధంగా అందరి సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్యం, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంపై పాలకవర్గ సభ్యులు జవాబుతారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని రంగాలను అభివృద్ధి చేసే విధంగా బడ్జెట్ కేటాయించడం జరుగుతుందని, ఆయా కేటాయింపుల ప్రకారంగా నిధులను వినియోగించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అర్హత గల ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ సర్వేను విజయవంతం చేయాలి

### భద్రాద్రి డీఈవో నాగలక్ష్మి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 27 : భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీలలో భద్రాద్రి జిల్లాలో ఎన్నిక చేసిన 19 పాఠశాలల్లో జరిగే ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ(ఎఫ్ ఎల్ ఎస్) ను సమర్ధవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయ విద్యా కళాశాల భద్రాచలం విద్యార్థులతో భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి అన్నారు. ఈ సర్వే కోసం ఎన్నిక చేయబడిన ఛాత్రోపాధ్యాయులకు ఉపాధ్యాయ విద్యా కళాశాల, భద్రాచలంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఛాత్రోపాధ్యాయులంతా భవిష్యత్తులో కాబోయే ఉపాధ్యాయులని, అందువల్ల భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఇటువంటి సర్వేలో పాల్గొనడం ద్వారా గ్రామస్థాయిలో పాఠశాల స్థితిగతులు అదేవిధంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని, దీని ద్వారా చాత్రోపాధ్యాయులు వారి శిక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని సూచించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ మాట్లాడుతూ ఈ సర్వే పూర్తిగా ట్యాబ్ ఆధారంగా జరుగుతుందని, ఈ ట్యాబ్ ఆధారంగా జరిగే సర్వే కొరకు చాత్రోపాధ్యాయులకు పూర్తిస్థాయిలో రెండు రోజులపాటు శిక్షణ అందించి వారికి టాబ్లు కూడా అందించి దాని ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే జిల్లాలోని ఎన్నిక చేసిన 19 పాఠశాలల్లో గల 268 విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించబడుతుందని తెలిపారు. ఛాత్రోపాధ్యాయులకు 26 , 28 తేదీలలో రెండు రోజులపాటు ఈ శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ భవాని మాట్లాడుతూ ఇటువంటి సర్వేలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొనటం చాలా ఆనందదాయకమని, ఈ సర్వే ద్వారా విద్యార్థులు తమ అభ్యసనను పూర్తిస్థాయిలో మెరుగుపరచుకొని మంచి ఉపాధ్యాయులుగా సమాజంలోకి ప్రవేశిస్తారని అన్నారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్స్ గా రవికుమార్, హరిదాస్ వ్యవహరించగా సాంకేతిక నిపుణులుగా కార్తీక్, అల్లూరి రెడ్డి వ్యవహరిస్తున్నారు.

# రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

### - అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ చైర్మన్ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మార్చి 27 : ఏప్రిల్ 4 నుండి 7 వరకు గోదావరిఖనిలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, ఎల్లమ్మ మారు బోనాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మేరుగు హనుమంత్ గౌడ్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్ నెలలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ 4న ఆలయ ప్రథమ వార్షికోత్సవం, 5న ఉదయం 10 గంటలకు పోచమ్మ బోనాలు, 6న పుట్టధ్వని, 7న సాయంత్రం 6 గంటలకు ఎల్లమ్మ మారు బోనాల కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. గౌడ కులస్తుల కులదైవంతోపాటు గ్రామ దేవత అయిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో, మారు బోనాల కార్యక్రమంలో పట్టణ ప్రజలు అందరూ పాల్గొనాలని కోరారు. మహిళలు బోనాలతో తరలిరాగా, గౌడ కుటుంబాలు, బంధువర్గం అందరూ కార్యక్రమంలో భాగస్వాములై ఆ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో గౌడ సంఘం నాయకులు కోట రవి గౌడ్, వంగ శ్రీనివాస్ గౌడ్, బాలసాని స్వామి గౌడ్, మంద రమేష్ గౌడ్, పొన్నం విజయ్ కుమార్ గౌడ్, గడ్డం రవి, పొన్నం అంజయ్య, అశోక్, బిందె నాగభూషణం, మాచిడి మహేందర్ గౌడ్, యాదగిరి, భాస్కర్, బాలసాని కొమురయ్య, సత్తయ్య, శ్రీనివాస్, సురేందర్, కృష్ణమూర్తి, రాజయ్య, గోపి, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యునిపై దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు

### - జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం లేదు

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, మార్చి 27 : జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సాధారణ ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలందించాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### - గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మార్చి 27 : ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ శ్రీహర్ష గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగాలను, క్రిటికల్ కేర్ సెంటర్, ఎస్.ఎన్.సి.యూ, ఎక్స్ రే ఏరియా, అల్ట్రా సౌండ్, చిన్న పిల్లల విభాగం, ఫిజియోథెరపీ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆసుపత్రికి అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో అదనంగా ఒక ఎక్స్ రే మెషిన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఏర్పాటు చేయాలని, ఫిజియోథెరపీ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టాలని అన్నారు. సదరం విభాగంలో చేసిన ఏర్పాట్ల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి న్యూ బ్లాక్ లో అవుట్ పేషంట్ రూమ్ లను పరిశీలించారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరవుతూ రోగులకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎన్టిపిసి సిఎస్ఆర్ నిధులతో గోదావరిఖనిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్య అధికారులు డాక్టర్ అరుణ, డాక్టర్ కృపా భాయ్, డాక్టర్ రాజు, నర్సింగ్ పర్యవేక్షకులు మరదలిన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన అభ్యర్థులకు ఫౌండేషన్ శిక్షణ తరగతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : ఐ.టి.డి.ఎ, ఏటూరునాగారం ఆధ్వర్యంలో పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన గిరిజన అభ్యర్థులను ఎంపిక చేసి ఆసక్తి కలిగిన అభ్యర్థులకు కేంద్ర మరియు రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికకై గ్రూప్స్,పోలీస్,బ్యాంకింగ్,రైల్వేస్,యస్.యస్.సి మరియు ఇతర ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ఫౌండేషన్ శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఐ.టి.డి.ఎ., ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇ శిక్షణ ఇచ్చుటకు అనుభవం కలిగిన శిక్షణ సంస్థల నుండి ప్రతిపాదనలు ఆహ్వానించడమైనదని శిక్షణ సంస్థలకు ఉండవలసిన అర్హతలు కనీసం ఐదు సంవత్సరాలు పైన తెలిపిన కోర్సులలో శిక్షణ ఇచ్చిన అనుభవం కలిగి ఉండాలని,గత శిక్షణలో మంచి ఫలితాలు సాధించి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసిన అనుభవం కలిగి ఉండాలన్నారు.గిరిజన సంక్షేమ శాఖతో కలిసి పని చేసిన అనుభవం కలిగి ఉండాలి.టి.డబ్ల్యు. స్టడీ సర్కిల్ (పి.ఇ.టి.సి) హన్మకొండ నందు శిక్షణ ఇచ్చుటకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు.కావున పైన తెలుపబడిన అర్హతలు కలిగి ఉండి స్టడీ సర్కిల్ లో గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చుటకు ఆసక్తి గల శిక్షణ సంస్థలు, తమ ప్రతిపాదనలు (కొటేషన్స్) ఈ నెల 31వ తేది సాయంత్రం 5.00 గం వరకు టి.డబ్ల్యు.స్టడీ సర్కిల్ (పి.ఇ.టి.సి), హన్మకొండ నందు సమర్పించవలసి నదిగా తెలిపారు.

# ఆధునిక సాంకేతికతతో పారిశుధ్య పనులు..

### - 12వ వార్డులో ముమ్మరంగా సాగుతున్న డ్రైనేజీ మరమ్మతులు

### - గంటల వ్యవధిలోనే డ్రైనేజీ సమస్య క్లియర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పటన్చేరు, మార్చి 27 : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గల ప్రముఖ్ నగర్ కాలనీలో దీర్ఘకాలంగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను వార్డు కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి త్వరితగతిన పరిష్కరించారు. కాలనీలోని ప్రధాన డ్రైనేజీ పైపులైన్లు పూడికతో నిండిపోయి, మురుగునీరు రోడ్లపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన ఆయన, తక్షణమే స్పందించారు. సాధారణ పద్ధతుల్లో పూడికతీత సాధ్యం కాకపోవడంతో, కిషోర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధునాతన 'వ్యాక్యూమ్ జెట్టింగ్' వాహన యంత్రాన్ని మున్సిపల్ అధికారుల సహకారంతో రప్పించారు. ఈ యంత్రం సహాయంతో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను, మట్టిని పూర్తిగా తొలగించి, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా మరమ్మతులు చేయించారు. మురుగునీరు నిలిచిన చోట క్లోరినేషన్ చేయించి, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మచ్చ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి సమస్యను తన సొంత సమస్యగా భావిస్తానని పేర్కొన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనే నా ప్రథమ ప్రాధాన్యత. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగినా ముందుండి సమస్యను పరిష్కరిస్తానని, రాబోయే రోజుల్లో 12వ వార్డును ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దుతానని, ప్రజలకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండి సేవ చేస్తానని,ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# చిట్కూల్ వార్డు మంజీరానగర్ కాలనీ డ్రైనేజీ సమస్యపై కౌన్సిలర్, కమిషనర్ల భరోసా

## వర్షాకాలంలోపు శాశ్వత పరిష్కారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు, మార్చి 27 : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కూల్ 6వ వార్డు మంజీరా నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యల పరిష్కారానికి స్థానిక కౌన్సిలర్ బ్యాగరి వెంకటేశం అలాగే మున్సిపల్ కమిషనర్ వెంకట్ కిషన్ రావు సానుకూలంగా స్పందించారు. గురువారం ఉదయం కాలనీ వాసులు తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముందుగా కాలనీ వాసులు 6వ వార్డు కౌన్సిలర్ బ్యాగరి వెంకటేశంను కలిసి కాలనీలోని నెలకొన్న డ్రైనేజి రోడ్ల సమస్యల పరిస్థితులను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ మంజీరా నగర్‌లో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను త్వరలోనే గుర్తించి డ్రైనేజి సమస్యను పరిష్కరిస్తామని, జరగబోయే మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో తన వార్డు సమస్యలను అందులో మంజీరా నగర్ కాలనీలోని డ్రైనేజీ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అతి త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

**మున్సిపల్ కమిషనర్‌కు వినతి**

మంజీరా నగర్ కాలనీ వాసులు ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మున్సిపల్ అధికారిని కలిసి తమ కాలనిలోని డ్రైనేజి లైన్ లేనందున మురుగునీరు ఇళ్ల బయటే నిలిచి ఉంటుందని దీనివల్ల దుర్వాసన వెదజల్లుతోందని, దోమల వ్యాప్తి వల్ల మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాల బారిన పడి హాస్పిటల్ పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్న కమిషనర్ మాట్లాడుతూ.."మీ సమస్య మా దృష్టికి వచ్చింది. డ్రైనేజీ అవుట్‌లెట్ వెళ్లే మార్గాన్ని స్పష్టంగా వివరిస్తే, మేము స్థానిక కౌన్సిలర్‌తో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేస్తాం." అని తెలిపారు. అంతేకాకుండా వచ్చే వర్షాకాలం లోపు తప్పనిసరిగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మంజీరా కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం మున్సిపల్ యంత్రాంగం ఎల్లప్పుడూ సహకరిస్తుందని కమిషనర్ వెంకట్ కిషన్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ తలారి ఆంజనేయులు, మంజీరా నగర్ కాలనీ సభ్యులు పాల్గొన్నారు..

# పేకాట ఆడుతూ పట్టుబడ్డ జైపూర్ ఎంపీడీవో

**- ఉద్యోగులపై వేధింపుల ఆరోపణలు**

**- అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని" డిమాండ్**

(ప్రజాలక్ష్యం బ్యూరో)



మంచిర్యాల మార్చి 27 : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ జన్నారం మండలంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఘటన సంచలనం రేపుతోంది. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా, సంబంధిత అధికారిపై మరోవైపు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యక్తిగత అవసరాల కోసం కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమాచారం. ఈ విషయంపై ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్పందించిన స్థానికులు, ఇలాంటి అవినీతి అధికారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై శాఖపరమైన విచారణ జరుగుతుందా? తప్పు నిరూపితమైతే ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఆసక్తికరంగా మారింది.

# పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మార్చి 26 : విద్యార్థి దశ నుండి పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని అటవీ బీట్ అధికారులు రాజేష్ అన్నారు. బెండర ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు బొటానికల్ సందర్శనలో భాగంగా జిల్లా కేంద్రంలోని నర్సరీని అధ్యాపకుడు స్వామి ఆధ్వర్యంలో సందర్శించగా బీట్ అధికారులు కిషోర్, శ్రీవిద్యలతో కలిసి నర్సరీ అవసరాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జాతి మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. పర్యావరణంపై విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలన్నారు. నర్సరీ పెంపకంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు దాని ఉపయోగాలను క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్"లో భాగంగా చెన్నూర్‌లో డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరం

**- 150 మందికి పరీక్షలు-24 మందికి కళ్లద్దాలు, 5 మందికి శస్త్రచికిత్సకు పంపిణీ**

**- గాంధీ చౌక్‌లో చలి వెంద్రం ప్రారంభం వేసవిలో తాగునీటి సదుపాయం**

**- మంచిర్యాల డిసిపి భాస్కర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



చెన్నూరు మార్చి 27 : రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్ నేతృత్వంలో చెన్నూర్ బస్ స్టాండ్ ప్రాంతంలో ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వరులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో స్పష్టమైన చూపు కీలకమని, ప్రతి డ్రైవర్ సమయానుకూలంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే శిబిరంలో సుమారు 150 మంది డ్రైవర్లు పరీక్షలు చేయించుకోగా, 24 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా 5 మందిని కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వరులు సమక్షంలో "చలి వెంద్రం"ను ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజలకు చల్లని తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు. పోలీస్ ఉన్నత అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో మహేశ్వరి మెడికల్‌పై ఆరోపణలు

**- అర్హత లేని సిబ్బంది వల్ల రోగుల్లో గందరగోళం**

**- ట్రాఫిక్ సమస్యలపై ఆగ్రహం**

(ప్రజాలక్ష్యం బ్యూరో)




మంచిర్యాల మార్చి 27 : జిల్లా కేంద్రంలో ఉన్న మహేశ్వరి మెడికల్‌పై స్థానిక ప్రజలు, రోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత లేని సిబ్బంది ద్వారా మందులు అందించడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులు ఇవ్వాల్సిన చోట, సిబ్బంది తమ స్వంత విధానంలో వివరాలు చెప్పడం వల్ల రోగులు గందరగోళానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా, ఈ మెడికల్ షాప్ వద్ద ట్రాఫిక్ సమస్యలు కూడా తీవ్రమవుతున్నాయి. మెడికల్‌కు వచ్చే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై ట్రాఫిక్ అధికారులు మాత్రమే కాకుండా జిల్లా వైద్యశాఖ అధికారులు కూడా వెంటనే స్పందించి, పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అర్హత లేని సిబ్బందిని తొలగించడం, నిబంధనలు ఉల్లంఘిస్తున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# జిల్లాలో ఇంధన కొరత లేదు

**- పుకార్లను నమ్మవద్దు**

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్ మార్చి 27 : జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నా యని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లు కనిపిస్తున్న నేపథ్యంలో, పరిస్థితిని సమీక్షించి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అపోహలేనని స్పష్టం చేసిన కలెక్టర్, అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా కొనసాగుతోందని, పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ వద్ద తగిన నిల్వలు ఉన్నట్లు ధృవీకరించినట్లు తెలిపారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని సూచించారు. పరిస్థితిని దగ్గరగా గమనించేందుకు అదనపు కలెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు 'పానిక్ బాయింగ్'కు పాల్పడవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలకు అవసరమైన ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

# వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో బాలికపై ఉపాధ్యాయుడి అత్యాచారం

**- ప్రశ్నించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు**

**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మార్చి, 27 : ( ప్రజాలక్ష్యం )వనపర్తి జిల్లా కేంద్రంలోని అక్షర స్కూల్లో ఓ మైనారిటీ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ కీచక టీచర్, బాధితురాలికి న్యాయం చేయాలని అడిగేందుకు పాఠశాలకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు అక్రమ అరెస్టు చేసిన బాధితులను పోలీస్ స్టేషన్లో పరామర్శించి, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు మరియు సిపిఎం, సీపీఐ నాయకులు అఘాయిత్యానికి పాల్పడిన ఉపాధ్యాయుడిని, పాఠశాల యాజమాన్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు చేసిన కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంటనే ప్రభుత్వపరంగా బాధితురాలికి న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# వన్య ప్రాణుల దాహార్తి కోసం నీటివసతి ఏర్పాటు

**- చొరవ తీసుకున్న టీజీ ఎఫ్ డీసీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల మార్చి 27 : ఎండలు మండి పోతున్న ఈ వేసవిలో అడవులు, ప్లాంటేషన్ లలో సంచరించే వన్య ప్రాణుల దాహం తీర్చ డానికి తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ (టీజీ ఎఫ్ డీసీ ) ఆధ్వర్యంలో బుధవారం నీరు నిల్వ ఉండేలా వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. ..వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల రేంజ్ పరిధిలోని జైపూర్ మండలం ముదికుంట అటవీప్రాంతం లో టీజీ ఎఫ్ డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్ లలో ఒక కాలువ లో ఒక చోట నీటి ఊటను ప్లాంటేషన్ వాచర్ శంకర్ గమనించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే టీజీ ఎఫ్ డీసీ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ దీనికి ఒక కార్య రూపం దాల్చారు. గురువారం ప్లాంటేషన్ వాచర్ శంకర్, కొంత మంది కూలీల సహాయం తో జంతువులు తాగడానికి వీలుగా నీటి ఊట నీరు వృధాగా పోకుండా కొంత మేరకు మట్టి పూడిక తీయించి అడ్డు కట్ట వేయడం తో నీరు నిల్వ గా ఆగిపోయింది. ఈ సందర్భంగా ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మూగ జీవాలైన వన్య ప్రాణులు వేసవిలో తాగు నీరు దొరకక చాలా ఇబ్బందులు పడుతుంటాయని, వాటి దాహార్తి తీర్చడం కోసం చిరు ప్రయత్నం చేసినట్లు తెలిపారు.

# రామచలం కొండపై సామూహిక కుంకుమార్చన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ మార్చి 27 : మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో శ్రీ రామచలం కొండపై వెలిసిన దివ్య క్షేత్రం రామాలయ ఆలయం నిర్వహిస్తున్న 42వ కళ్యాణ మహోత్సవ ఉత్సవాలలో సందర్భంగా రెండవ రోజు చైత్ర శుద్ధ అష్టమి గురువారం వేద పండితులచే ఉదయం గోపూజ శ్రీరామ మూల మంత్ర వాహనము హోమం యాగము మహిళా స్త్రీమూర్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.





ప్రజాలక్ష్యం

22 Mar 2026| Editor: Goli Sammi Reddy | Page 2

Source: epaper.prajalakshyam.com

దర్జాగా రేషన్ అక్రమ రవాణా

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

# ప్రజా లక్ష్యం కథనానికి స్పందన

**- అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత**

**- ఐదుగురు వ్యక్తుల పైన 6 కేసు నమోదు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మార్చి 27 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి గ్రామంనుండి మహారాష్ట్రలోని అహరికి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఎమ్ఞ 33 ఎ 4765 నంబర్ గల బొలెరో వాహనాన్ని గురువారం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈనెల 21న" దర్జాగా రేషన్ అక్రమ రవాణా" చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు అనే కథనాన్ని ప్రజాలక్ష్యం దినపత్రికలో ప్రచురించడంతో సంబంధిత అధికారులు స్పందించారు. బొలెరో వాహనంలో సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామని మహారాష్ట్రలోని అహేరి గ్రామానికి చెందిన నిహాల్ షేక్ అనే వ్యక్తి తన వాహనాలను తెలంగాణ సరిహద్దు గ్రామాలకు పంపించి స్థానిక దళారుల సహాయంతో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నట్లు తెలిసింది. నిహాల్ షేక్ తో పాటు మరో ఐదుగురు మీద 6ఏ కేసు నమోదు అయినట్లు వారు తెలిపారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్షెట్టిపేట, మార్చి 27 : అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా లక్షెటిపేట పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై గోపతి సురేష్ మాట్లాడుతు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్జా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ నెల 25 నుంచి 31వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వాహన డ్రైవర్లు, వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. దానివలన కలిగే అనర్థాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ పన్నులను 100 శాతం వసూలు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామకృష్ణాపూర్ మార్చి 26 : రామకృష్ణాపూర్ మున్సిపల్ పరిధిలో పన్నులను 100 శాతం వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తో కలిసి పన్నుల వసూలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కొరకు పన్ను వసూలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పన్నుల వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వేసవికాలం అయినందున ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిబంధనల ప్రకారం త్వరగా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

**అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : పారిశుధ్యం, అభివృద్ధి పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఆదాయాన్ని పెంచుకోవాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని సూచించారు. వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించి, అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సోలార్, ఎలక్ట్రికల్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌల లభ్యత మరియు ధరలపై వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలు ఉంటే, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీతో కలిసి సూచించారు. ఈ సమావేశంలో డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ నిరంజన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల తనిఖీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్ మార్చి 27 : జిల్లాలో ప్రజలకు అందుతున్న మీసేవా సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇ-జిల్లా మేనేజర్ నదీమ్, జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి కుంటాల, భైంసా, కుబీర్ మండలాల్లోని మీసేవా కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో అందిస్తున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. పౌరుల నుండి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు తప్ప ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయకూడదని స్పష్టంగా ఆదేశించారు. సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం, ఆలస్యం జరగకుండా చూడాలని, ప్రతి దరఖాస్తును సమయానికి పరిష్కరించాలని సూచించారు. అలాగే, ఈఎస్‌డీ కార్యాలయం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అధికారులకు తెలిపారు. కేంద్రాలలో పారదర్శకత ఉండేలా అవసరమైన సూచనలు ఇచ్చారు. మీసేవా కేంద్రాలలో ప్రజలకు ఏవైనా ఉల్లంఘనలు కనుగొనబడిన పక్షంలో ఈఎస్‌డీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కమనీయం..సీతారామ కళ్యాణం








సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు

**- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ - పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంక్ తగ్గించిన కేంద్రం**

**- పెట్రోల్‌పై రూ.13, డీఇల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,మార్చి 27 : పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు.

# ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలి

**- దౌత్యమార్గాలరు కేంద్రం పరిశీలించాలి**

**- జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శ్రీనగర్,మార్చి 27: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులను జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్ తరిగమి తీవ్రంగా ఖండించారు. ఈ సంఘర్షణను తక్షణమే నిలిపివేసి దౌత్య మార్గాల్లో పరిష్కారం కనుగొనాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీతో పాటు ఇతరుల హత్యలను ప్రస్తావిస్తూ, యుద్ధ విధానాన్ని సమర్థించలేమని స్పష్టం చేశారు. పిల్లలు సహా పౌరుల ప్రాణనష్టం, యుద్ధ ప్రభావాలు అసహ్యకరమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల వెనుక ప్రకటించిన లక్ష్యాలపై ప్రశ్నలు లేవనెత్తిన అబ్దుల్లా, యుద్ధ ప్రభావాలు జమ్మూ కాశ్మీర్‌లో కూడా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇరాన్‌లో కొంతమంది భారతీయులు చిక్కుకుపోయారని, పెట్రోల్ పంపుల వద్ద పొడవైన క్యూలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను ప్రభావితం చేసే అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీకి పూర్తి హక్కు ఉందని అన్నారు. ఇదే విషయంపై స్పందించిన మహమ్మద్ యూసుఫ్ తరిగమి, సంఘర్షణను ముగించడంలో కేంద్రం చురుకైన, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కోరారు. ఇరాన్‌తో భారతదేశానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేస్తూ, దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక స్వరాలు వినిపించాలని సూచించారు. పరిస్థితిని శాంతింపజేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇరాన్‌పై దాడులు తీవ్రం

మొదటిపేజీ తరువాయి

సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## దేశంలో ఎరువుల కొరత లేదు

మొదటిపేజీ తరువాయి

అని జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్‌ఎన్‌జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# నటుడు రాహుల్ రామకృష్ణ కుటుంబంలో విషాదం

**- గడ్డి మందు ప్రభావంతో సోదరుడు మృతి**

**- పారాక్వాట్‌ను నిషేధించాలని రామకృష్ణ బహిరంగ వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి 27 : ప్రముఖ నటుడు, సినీ రచయిత రాహుల్ రామకృష్ణ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు పారాక్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన గడ్డి నివారణ మందు కారణంగా మరణించారు. ఈ విషాద వార్తను పంచుకుంటూ రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా చేసిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారాక్వాట్ వంటి ప్రాణాంతక రసాయనాలు మార్కెట్‌లో ఎంత సులభంగా అందుబాటులో ఉన్నాయో వివరించాడు. ఈ విషప్రయోగం వల్ల సంభవించే మరణాల సంఖ్యను చూసి వైద్యులు కూడా దిగ్భ్రాంతికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయానికి బహిరంగ విన్నపం చేశారు. పారాక్వాట్ అనేది చాలా శక్తివంతమైన రసాయనమని, దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల ఇది శరీరంలోకి వెళ్ళిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు మరియు కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వ్యవసాయ అవసరాల పేరుతో ఈ విషం మార్కెట్లలోనే కాకుండా ఈ-కామర్స్ సైట్లలో కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని, దీనిని ఆత్మహత్యలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు. ఇలాంటి ప్రాణాంతక మందును తక్షణమే నిషేధించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే పలు దేశాల్లో నిషేధానికి గురైన ఈ రసాయనంపై భారత్‌లో కూడా ఆంక్షలు విధించాలనే డిమాండ్‌కు నెటిజన్ల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

# దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమనాశ్రయం

మొదటిపేజీ తరువాయి


రెండో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ విమానాశ్రయాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్మించారు. 3,900 మీటర్ల పొడవైన రన్‌వే.. ఏటా 12 మిలియన్ల ప్రయాణికులు ప్రయాణం చేసేలా అత్యంత అద్భుతంగా నిర్మించారు. తాజాగా ఓపెనింగ్‌కు సిద్ధమైంది. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశ ప్రారంభం కానుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. అనంతరం టెర్మినల్‌ను మోడీ పరిశీలించనున్నారు.

ఇక ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభం కాగానే ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ తగ్గి.. విమానాల సామర్థ్యం పెరుగుతుంది. మొదటి దశలో విమానాశ్రయం సంవత్సరానికి 12 మిలియన్ల (2 కోట్ల) మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. తదుపరి దశలలో ఈ సామర్థ్యాన్ని 70 మిలియన్ల (7 కోట్ల) మంది ప్రయాణికులకు విస్తరింపజేస్తారు. ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు, ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, ఆధునిక లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం యమునా ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉంది. మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించారు. ఇది రోడ్డు, రైలు, మెట్రో, ఇతర ప్రాంతీయ రవాణా మార్గాల ద్వారా అద్భుతమైన కనెక్టివిటీని అందిస్తుంది. విమానాశ్రయం డిజైన్, ఘాట్‌లు, భవనాలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో 24 గంటల విమాన సర్వీసులను అందించనుంది. నేటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్ వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది.

# తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన



అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

మొదటిపేజీ తరువాయి

వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

# బాలరాముడి నుదుటిపై సూర్య తిలకం

మొదటిపేజీ తరువాయి

ఎ÷-లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

# ఒంటిమిట్టలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

ఎ. ప్రశాంతి, శ్రీ ఎ. శివప్రసాద్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇకపోతే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో శుక్రవారం తలంబ్రాల ప్యాకింగ్‌ను టీటీడీ శాస్త్రోక్తంగా ప్రారంభించింది. ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఏసి వద్దకు తీసుకొచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణం కోసం తలంబ్రాల తయారీకి అవసరమయ్యే పసుపు వినియోగించేందుకు మార్చి 25న పుసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నారు. తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి 1.60 లక్షల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు దాదాపు 600 మంది శ్రీవారి సేవకులు తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు శ్రీమతి ప్రశాంతి, శ్రీ శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కూలిన కళ్యాణోత్సవ వేదిక

మొదటిపేజీ తరువాయి

వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమా దం జరిగింది. సీతారాముల కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇలాంటి సమయంలో వేదిక కూలడంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ అపశృతి జరిగిందంటూ తీవ్రంగా విమర్శించారు.

# భూపాలపల్లిలో వైభవంగాశ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

## - భక్తులతో కిటకిటలాడిన దేవాలయ ప్రాంగణం

## - హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే, సింగరేణి జీఎం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మార్చి 27 : జయశంకర్–భూపాలపల్లి జిల్లా సుభాష్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతూ, భక్తుల హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ మహోత్సవానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొని నిర్వాహకుల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి ధార్మిక కార్యక్రమాలుసమాజంలో ఐక్యతను పెంపొందించ డంతో పాటు సాంప్రదాయ విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ సునీత రాజేశ్వర్ రెడ్డి దంపతులు ఈ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. వారి భక్తి శ్రద్ధలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది. వివిధ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. దేవాలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈసందర్భంగాఏరియా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, ఈ మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, దాతలు, సేవా మహిళలు, వాలంటీర్లు, భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ఎస్ఓటుజీఎం ఎస్.కవీంద్ర, ఏజీఎం (ఈ అండ్ ఎం) ఎం.ఎర్రన్న, ఏజీఎం (సివిల్) రవికుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ తదితర సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సీతారాముల కళ్యాణ సేవలో సింగరేణి భారత్ స్కౌట్స్ కీలక పాత్ర

## - భక్తుల నిర్వహణలో క్రమశిక్షణతో సేవలు - ప్రశంసలు వెల్లువ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మార్చి 27 : భూపాలపల్లి పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో సింగరేణి భారత్ స్కౌట్స్ కీలక పాత్ర పోషించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని కళ్యాణ కార్యక్రమాన్ని సమీపంలో నుంచే పర్యవేక్షించారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులను క్రమపద్ధతిలో నిర్వహించడంలో సింగరేణి భారత్ స్కౌట్స్ విశేష సేవలు అందించారు. తీర్థప్రసాదాల పంపిణీ, భక్తుల క్యూల నిర్వహణ, క్రమశిక్షణ పాటించేటట్లు చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. వారి సేవా తత్పరతతో కార్యక్రమం ఎలాంటి అవరోధాలు లేకుండా సజావుగా సాగింది. భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కల్పించడంలో స్కౌట్స్ చేసిన కృషి ప్రశంసనీయంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సింగరేణి భారత్ స్కౌట్స్ సేవలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో వారి పాత్ర మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# శిథిలావస్థలో చినముప్పారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం

## - కాకతీయ కాలం వైభవం...నేటి నిర్లక్ష్యానికి బలి అయిన చారిత్రక క్షేత్రం

## - ఆలయ పునర్నిర్మాణాన్ని కోరుతున్న భక్తులు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 27 : కాకతీయ రాజులు నిర్మించిన చెరువులు, దేవాలయాలు నేటికీ వారి దూరదృష్టికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. పాకాల, లక్నవరం వంటి చెరువులు త్రవ్వించి వ్యవసాయానికి ఊతమిచ్చిన వారు, ప్రజల్లో భక్తి భావం పెంపొందించేందుకు వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయం వంటి అద్భుత కట్టడాలను నిర్మించారు. అయితే, అదే కాకతీయ కాలానికి చెందిన ఎన్నో చారిత్రక దేవాలయాలు నేటి నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థలోకి చేరడం బాధాకరం. ఇలాంటి నిర్లక్ష్యానికి గురైన ఆలయాలలో ఒకటి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని చినముప్పారం అగ్రహారంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం. చరిత్రను పరిశీలిస్తే, కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రునికి చెందిన ఇద్దరు చెల్లెళ్ళు పెద్ద ముపాంబిక, చిన్న ముపాంబిక పేర్లతోనే పెదముప్పారం, చినముప్పారం గ్రామాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. వీరు శ్రీ చెన్నకేశవ స్వామి భక్తురాళ్లుగా ప్రసిద్ధి చెందారు. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం శ్రీమద్ రామానుజాచార్యులు శ్రీ వైష్ణవ మతాన్ని స్థాపించి దాని ప్రచారం కోసం శ్రీరంగం, కాంచీపురం వంటి దివ్యక్షేత్రాల నుంచి ఆళ్వారుల సంతతికి చెందిన ఆచార్యులు తెలంగాణ ప్రాంతానికి వచ్చి ఇక్కడి ప్రజలకు శ్రీ వైష్ణవ తత్వాన్ని బోధించారు. ఈ క్రమంలో శ్రీ కురతాళ్వార్, శ్రీ పరాశర భట్టర్, శ్రీ వేదవ్యాస భట్టర్ వంటి గురువులు ఈ ప్రాంతంలో నివసిస్తూ ధర్మ ప్రచారం చేశారు. శ్రీ వేదవ్యాస భట్టర్ వంశస్థులు ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి అగ్రహారంలో నివసిస్తూ చుట్టుపక్కల ప్రాంతాల్లో వైష్ణవ మతాన్ని వ్యాప్తి చేశారు. వారి సేవలకు ఆకర్షితులైన భక్తులు గురుదక్షిణగా భూములు దానం చేశారు. దాదాపు 700 సంవత్సరాల క్రితం శ్రీరంగం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ ఆండాళ్ దేవి, శ్రీ కురత్తాళ్వార్ విగ్రహాలను ఎడ్లబండిపై తీసుకువస్తుండగా, చినముప్పారం అగ్రహారం సరిహద్దులకు చేరగానే బండ్లు ముందుకు కదలకపోవడం ఒక విశేషంగా నిలిచింది. దీనిని దైవ సంకేతంగా భావించిన గురువులు అక్కడే దేవాలయం నిర్మించారు. ఈ దేవాలయానికి ధూపదీప నైవేద్యాల కోసం సుమారు 50 ఎకరాల భూమిని అగ్రహారికులు దానం చేశారు. ముఖ్యంగా శ్రీ కురత్తాళ్వార్ విగ్రహం సాధారణంగా తమిళనాడులోని శ్రీరంగం, కాంచీపురం ప్రాంతాల్లో మాత్రమే ఉండగా, తెలంగాణలోని చినముప్పారం అగ్రహారంలో కూడాఉండటం ఈ క్షేత్రానికి ప్రత్యేకతను తీసుకువచ్చింది. అయితే, ఈ చారిత్రక ఆలయం కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురైంది. ఢిల్లీ సుల్తానుల దాడికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం కావడంతో ఆదాయం లేక ఆలయం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం దేవాదాయ శాఖ నుంచి ప్రతినెల ధూపదీప నైవేద్యాల కోసం కొంత నగదు మాత్రమే అందుతోంది. ఆలయ పరిస్థితిని గమనించిన గ్రామస్థులు అభివృద్ధి కోసం ముందుకొచ్చి సుమారు పది లక్షల రూపాయలను జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో మహబూబాబాద్ ఎమ్మెల్యే ప్రయత్నాల ఫలితంగా దేవాదాయ శాఖ రూ.40 లక్షలు, భక్తుల నుంచి రూ.10 లక్షలతో ఆలయ పునర్నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకంలో రాజగోపురం, అధ్యయన మండపం, కళ్యాణ మండపం నిర్మాణాలు ఉన్నాయి. అయితే ఉత్తర్వులు వెలువడిన నెలలు గడిచినా ఇప్పటివరకు టెండర్లు పిలవకపోవడం, కాంట్రాక్టర్లను నియమించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే"అన్నట్లుగా పరిస్థితి కొనసాగుతోంది. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. గర్భగుడిలోకి నీరు చేరడంతో నిత్యపూజలు నిర్వహించడం కూడా కష్టసాధ్యంగా మారింది. అర్చకుడు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ విధంగా కొనసాగితే ఆలయం పూర్తిగా కూలిపోవచ్చని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని, ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా ఆలయ పునర్నిర్మాణాన్ని వేగవంతం చేయాలని భక్తులు కోరుతున్నారు. కాకతీయ కాలం చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే ఈ ఆలయాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యతగా స్థానికులు భావిస్తున్నారు.

# శ్రీరామనవమి సందర్భంగా దేవాలయాల్లో ఎమ్మెల్యే పూజలు

## చెన్నాపురంలో సీతారాముల కళ్యాణం -పట్టు వస్త్రాల సమర్పణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మార్చి 27 : భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం చెన్నాపురం (రూపురెడ్డిపల్లి) గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రేగొండ మండలంలోని రావులపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు గుర్తింపు సంఘాల అన్యాయం-ఏఐఎఫ్‌టియు ఆరోపణలు

## - హామీలు నెరవేర్చలేదని విమర్శలు-త్వరగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మార్చి 27 : సింగరేణి కార్మికులకు గుర్తింపు సంఘాలు అన్యాయం చేశాయని ఏఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకుడు చంద్రగిరి శంకర్ ఆరోపించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘాలుగా గెలుపొందిన కార్మిక సంఘాలు గత రెండు సంవత్సరాల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రధాన డిమాండ్లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. గుర్తింపు సంఘాల రెండు సంవత్సరాల పదవీకాలం డిసెంబర్ 27తో ముగియనున్న నేపథ్యంలో, సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని లేబర్ కమిషనర్‌ను ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు 200 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ హామీ నెరవేర్చలేదని ఆయన పేర్కొన్నారు. అలాగే వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అమలు చేయలేదని, మారుపేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన హామీలు కూడా నెరవేరలేదని విమర్శించారు. సింగరేణి సంక్షేమానికి సంబంధించి ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, డిస్మిస్ అయిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయడంలో కూడా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. పనిముట్లు, నిత్యావసర సరుకులు వంటి కార్మికుల సమస్యలపై కూడా చర్చించకపోవడం వల్ల వారి మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేంత వరకు అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని చంద్రగిరి శంకర్ పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com